teenmaardesk@gmail.com

RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...

తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 04 | సంచిక : 96 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | శనివారం | 13 సెప్టెంబర్ 2025 | పేజీలు : 08 | వెల ‘5

Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad.


## ఈ నెల 15న మంచిర్యాల రైల్వే స్టేషన్లో వందే భారత్ ప్రారంభం




హైదరాబాద్, సెప్టెంబర్ 12 (తీన్మార్ న్యూస్): ఈ నెల 15న మంచిర్యాల రైల్వే స్టేషన్ లో కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చేతుల మీదుగా వందే భారత్ రైలు ప్రారంభించడం జరుగుతుందని, దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజన్ మంచిర్యాల చీఫ్ కమర్షియల్ ఇన్స్పెక్టర్ ఎన్. దేవేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.15 గంటలకు నాగ్ పూర్ – సికింద్రాబాద్ రైలును జెండా ఊపి ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు.



# భారీ వర్షాలు అలర్ట్..





## తెలంగాణలో మూడు రోజులు భారీ వర్షాలు

ఆదిలాబాద్, ఖమ్మం సహా 6 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం

40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు

హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరిక



15వ ఉపరాష్ట్రపతిగా సిపి రాధాకృష్ణన్ ప్రమాణ స్వీకారం

.. వివరాలు 2లో



తెలంగాణ కాంగ్రెస్ బీసీ గర్జన సభ వాయిదా

భారీ వర్షాల కారణంగా నిర్ణయం

తదుపరి తేదీ త్వరలో వెల్లడి

.. వివరాలు 2లో



కాళోజీవర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ మెరిట్ జాబితా విడుదల

.. వివరాలు 2లో

## దేశమంతటా బ్యాన్ చేయాలి

పాసులపై సుప్రీంకోర్టు సంచలన కామెంట్స్

ఢిల్లీలోనే కాదు.. దేశమంతటా నిషేధించాలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించాలని ఆదేశం

ఆందోళన వ్యక్తం చేసిన చీఫ్ జస్టిస్ బి.ఆర్. గవాయ్



02

## మేం బీఆర్ఎస్‌లోనే ఉన్నాం

స్పీకర్ నోటీసులకు ఫిరాయింపు ఎమ్మెల్యేల వివరణ

ఫిరాయింపు ఎమ్మెల్యేలపై వేటు తప్పినట్టేనా?

దానం నాగేందర్, కడియం శ్రీహరికి టెక్నికల్ సమస్యలు

స్పీకర్ నిర్ణయంపైనే వేటు భవిష్యత్తు



02

## సింగరేణిలో అవినీతిపై సీబీఐకి ఫిర్యాదు చేస్తాం



కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అవినీతి రాజ్యమేలుతోంది

ప్రతి కాంట్రాక్ట్‌లో 25% అవినీతి జరుగుతోందని ఆరోపణ

రాబోయే ఎన్నికల్లో హెచ్ఎంఎస్ విజయం సాధిస్తుందని ధీమా

జాగృతి అధ్యక్షురాలు కవిత కీలక ప్రకటన

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (తీన్మార్ న్యూస్): బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో హెచ్ఎంఎస్ – సింగరేణి జాగృతి సంయుక్త సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఇటీవల హెచ్ఎంఎస్ గౌరవ అధ్యక్షురాలిగా ఎన్నికైన కల్వకుంట్ల కవితను

మిగతా 2 లో



## త్వరలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తాం

నిరుద్యోగులు ఆందోళన చెందొద్దు

ఉద్యోగ నియామకాలు వేగవంతం చేస్తాం

కోర్టు తీర్పును రాజకీయం చేయొద్దు

అధికారంలోకి వచ్చాక 65 వేల ఉద్యోగాలు

పరీక్షల సన్నద్ధతతో ఉండాలని నిరుద్యోగులకు సూచన

ఉద్యోగ నియామకాలపై మంత్రి పొన్నం కీలక ప్రకటన

హుస్నాబాద్, సెప్టెంబర్ 12 (తీన్మార్ న్యూస్): నిరుద్యోగులు ఆందోళన చెందవద్దని, త్వరలోనే జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసి, దాని ప్రకారం ఉద్యోగ నియామకాల ప్రక్రియను వేగంగా పూర్తి చేస్తామని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం

మిగతా 2 లో

బాసర నుంచి భద్రాచలం వరకు

## టెంపుల్ సెంట్రిక్ ఘాట్స్

గోదావరి పుష్కరాల నేపథ్యంలో నిర్ణయం

ఘాట్స్ నిర్మించాలని రేవంత్‌రెడ్డి ఆదేశాలు



హైదరాబాద్, సెప్టెంబర్ 12 (తీన్మార్ న్యూస్): గోదావరి పుష్కరాల నేపథ్యంలో బాసర నుంచి భద్రాచలం వరకు టెంపుల్ సెంట్రిక్ ఘాట్స్ నిర్మించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రధాన ఆలయాల వద్ద శాశ్వత ఘాట్స్ నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఒకే సారి రెండు లక్షల మంది స్నానాలు చేసేందుకు

మిగతా 2 లో



## కుల ధ్రువీకరణ పత్రాల జారీలో కొత్త విధానం

ఇకపై మీ సేవ కేంద్రాల నుంచే నేరుగా సర్టిఫికెట్లు

పౌరులకు సత్వర సేవలు అందించడమే లక్ష్యం

.. వివరాలు 2లో

## సింగరేణిలో కీలక మార్పులు

కేవలం బొగ్గు గనులకే పరిమితం కాదు

ఇతర ఖనిజాల వేలంలో పాల్గొంటాం

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



## సర్కార్ నడుపుతున్నారా.. సర్కస్ నడుపుతున్నారా..

రేవంత్ ప్రభుత్వంపై మండిపడ్డ కేటీఆర్

చిన్నారి హాస్టల్‌లో పడిన ఘటనపై కేటీఆర్ వ్యాఖ్యలు

ఎక్స్ వేదికగా కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం

02





## ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసింది మీరే

పార్టీ ఫిరాయింపుల వివాదంపై మంత్రి జూపల్లి స్పందన

గతంలో ఇతర పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకోలేదా అంటూ నిలదీత

సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం నిర్ణయాలు ఉంటాయని స్పష్టం

.. వివరాలు 2లో

# భారీ వర్షాలు అలర్ట్..



తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 12 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ మేరకు ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. అలాగే మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, నల్గొండ, వరంగల్, హనుమకొండ, రంగారెడ్డి, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నాగర్‌కర్నూలు జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ మేరకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. రేపు నిర్మల్, నిజామాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. ఈ మేరకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. అలాగే 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఉరుములు మెరుపులతో కూడిన ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది. ఎల్లుండి ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, వరంగల్, హనుమకొండ, జనగాం జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. సోమవారం నాడు ఆదిలాబాద్, నిజామాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది.

## సింగరేణిలో అవినీతిపై సీబీఐకి ఫిర్యాదు చేస్తాం

మొదటి పేజీ తరువాయి



ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ సింగరేణిలో అవినీతిపై సీబీఐకి కంప్లైంట్ చేస్తామని కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణిలో అవినీతి రాజ్యమేలుతోందని ఆరోపించారు. రాబోయే సింగరేణి ఎన్నికల్లో హెచ్‌ఎంఎస్ జెండా ఎగురబోతోందని జోస్యం చెప్పారు. అవినీతిని కట్టడి చేయకుంటే సింగరేణి భవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ అంటేనే కరప్షన్ పార్టీ అని కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రతి కాంట్రాక్ట్‌లో 25 శాతం అవినీతి జరుగుతోందని ఆరోపణలు చేశారు. దాంట్లో 10 శాతం వాటా కాంగ్రెస్ పెద్దలకు వెళ్తోందని అన్నారు. సింగరేణిలో అవినీతిని ఎట్టిపరిస్థితుల్లో అంగీకరించం.. అవినీతిపై చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం, సీఎంలను డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే తామే సీబీఐకి, కేంద్ర దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేస్తామని ప్రకటన చేశారు. త్వరలోనే జరగబోయే సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో కార్మికుల విశ్వాసం పొంది హెచ్‌ఎంఎస్ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. హెచ్‌ఎంఎస్‌లో గౌరవాధ్యక్షురాలిగా నన్ను ఎన్నుకున్నారు. మీరిచ్చిన గౌరవాన్ని కాపాడుకుంటూ కార్మికుల బాగు కోసం పనిచేస్తానని హామీ ఇచ్చారు. టీబీజీకేఎస్ అనేది మొన్న ఎన్నికల్లో పోటీనే చేయలేదు. గుర్తింపు సంఘం అనుకుంటున్న వాళ్లు వాపును చూసి బలుపు అనుకుంటున్నారు. నిజానికి సింగరేణి ఎన్నికల్లో వాళ్లకు గెలిచే అంతా సీన్ లేదు. అప్పుడు ఉన్న పొలిటికల్ సిచ్యువేషన్ కారణంగా ఆ పరిస్థితి వచ్చింది. సింగరేణిలో ఇప్పుడున్న ఎర్రజెండా కాకుండా మరొక జెండా ముందుకు రాబోతోంది. హెచ్‌ఎంఎస్, జాగృతి సంస్థలు మొత్తం 40 వేల మంది సింగరేణి కార్మికుల కోసం పనిచేస్తాయి. సింగరేణిలో పనిచేయడమంటేనే ఎంతో రిస్క్‌తో కూడుకున్నది. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా సరే వారికి పూర్తి స్థాయిలో భద్రత ఉండదు. ముఖ్యంగా కాంట్రాక్ట్ ఎంప్లాయిస్‌ను మనుషులే కాదన్నట్లుగా చూస్తున్నారు. అలాంటి వారికి మేము అండగా ఉంటామని కవిత భరోసా ఇచ్చారు.

## సింగరేణిలో కీలక మార్పులు

హైదరాబాద్, సెప్టెంబర్ 12(తీన్మార్ న్యూస్ ): దేశంలో, ప్రపంచంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సింగరేణిలో మార్పులు తీసుకొస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. శుక్రవారం సింగరేణి సీఎండీ బలరాంతో కలిసి సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. సింగరేణి కేవలం బొగ్గు గనులకు పరిమితం కాకుండా ఇతర ఖనిజాల వేలంలో పాల్గొనేలా నిర్ణయం తీసుకున్నాం భట్టి విక్రమార్క కీలక వ్యాఖ్యలు చేశారు. సింగరేణి తెలంగాణ రాష్ట్ర ఆత్మ అని, ఈ సంస్థ కేవలం ఉపాధికే పరిమితం కాకుండా స్థానికులకు ఒక నమ్మకం కలిగిస్తోందన్నారు. సింగరేణికి అదనంగా రావాల్సిన బొగ్గు బ్లాకులు దక్కకపోవడం, కొత్త బ్లాకులు కేటాయించక పోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటోందన్నారు. కర్ణాటకలోని రాయచూర్, దేవదుర్గ్ బెల్ట్‌లో రాగి, బంగారం ఖనిజాల అన్వేషణలో సింగరేణి పాల్గొందన్నారు. మన రాష్ట్రంలో మరో 25 ఏళ్లకు సరిపడా మాత్రమే బొగ్గు నిల్వలు ఉన్నాయని, సింగరేణి సంస్థ వేలంలో పాల్గొనకపోతే బొగ్గు బ్లాక్‌లు ప్రైవేటు వ్యక్తులకు వెళ్తాయన్నారు. సత్తుపల్లి, కోయగూడెం బ్లాక్‌లు ఇప్పటికే ప్రవేటు వ్యక్తులకు వెళ్లాయని అన్నారు. కీలక ఖనిజాల వెలికితీతలో కూడా కేంద్రం సింగరేణి సంస్థకు అవకాశం కల్పించాలని కోరారు. మరోవైపు గ్రీన్ ఎనర్జీలో కూడా ఈ సంస్థ ప్రవేశించిందని, పలు రాష్ట్రాల్లోని ఎన్టీపీసీలకు సింగరేణి బొగ్గు సరఫరా చేస్తోందన్నారు.

## మేం బీఆర్ఎస్‌లోనే ఉన్నాం



హైదరాబాద్, సెప్టెంబర్ 12 (తీన్మార్ న్యూస్): పార్టీ మారిన ఆరోపణలు ఎదుర్కొంటున్న 10 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వేటు నుంచి తప్పించుకున్నట్టేనా అనే చర్చ రాజకీయ వర్గాల్లో తీవ్రంగా సాగుతోంది. బీఆర్ఎస్‌కు చెందిన 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారని, వారిని ఫిరాయింపు నిరోధక చట్టం కింద అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ దాఖలైన కేసులో మూడు నెలల్లోగా స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని ఆగస్టు 31న సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. ఈ తీర్పు నేపథ్యంలో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సదరు ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేశారు.

**ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసులు**

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ దానం నాగేందర్ (ఖైరతాబాద్), కడియం శ్రీహరి (స్టేషన్ ఘన్‌పూర్), ఆరికపూడి గాంధీ (శేరిలింగంపల్లి), గూడెం మహిపాల్ రెడ్డి (పటాన్ చెరు), బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి (గద్వాల), పోచారం శ్రీనివాస్ రెడ్డి (బాన్సు వాడ), ప్రకాశ్ గౌడ్ (రాజేంద్రనగర్), కాలే యాదయ్య (చేవెళ్ల), సంజయ్ కుమార్ (జగిత్యాల), తెల్లం వెంకట్రావు (భద్రాచలం)లకు నోటీసులు పంపారు.

**నోటీసులకు ఎమ్మెల్యేల వివరణ**

ఈ పది మంది ఎమ్మెల్యేలలో దానం నాగేందర్, కడియం శ్రీహరి మినహా మిగిలిన ఎనిమిది మంది నోటీసులకు స్పందించారు. తాము ఇప్పటికీ బీఆర్ఎస్‌లోనే ఉన్నామని, తమ నియోజకవర్గాల అభివృద్ధి పనుల కోసం మాత్రమే ముఖ్యమంత్రిని కలిశామని వారు వివరణ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆరికపూడి గాంధీ బీఆర్ఎస్ తరపున పీఏసీ ఛైర్మన్‌గా కూడా కొనసాగుతున్నారు.

**వేటు తప్పినట్టేనా..?**

స్పీకర్ మూడు నెలల్లోగా ఈ అంశంపై నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. అందులో భాగంగానే స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ వివరణ కోరారు. వారిచ్చిన వివరణపై స్పీకర్ సంతృప్తి చెందితే, ఆ ఎమ్మెల్యేలు వేటు నుంచి బయటపడనట్టేనని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే, దానం నాగేందర్ ఖైరతాబాద్ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతూ సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ ఎంపీగా పోటీ చేయడంతో ఆయనకు సాంకేతికంగా సమస్యలు తలెత్తే అవకాశం ఉందని తెలుస్తోంది. మరోవైపు, కడియం శ్రీహరి ముఖ్యమంత్రితో చర్చించిన తర్వాతే నోటీసులకు స్పందనపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు.

## త్వరలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తాం

మొదటి పేజీ తరువాయి



చేశారు. శుక్రవారం సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువును సందర్శించిన ఆయన, గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, నిరుద్యోగులు పరీక్షల సన్నద్ధతలో ఉండాలని సూచించారు.

**ప్రజా ప్రభుత్వంలో జాగ్రత్తగా నిర్ణయాలు**

తెలంగాణ పోరాటానికి మూలమైన నీళ్లు, నిధులు, నియామకాల విషయంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఎంతో జాగ్రత్తగా వ్యవహరిస్తోందని మంత్రి పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగ నియామకాలకు సంబంధించి అనేక వివాదాస్పద నిర్ణయాల వల్ల పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించి, అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే దాదాపు 65 వేల ఉద్యోగాలను ఇచ్చామని ఆయన తెలిపారు.

**కోర్టు తీర్పును రాజకీయాలకు వాడొద్దు**

గ్రూప్–1 పరీక్షల నిర్వహణలో కొన్ని లోపాలు ఉన్నాయనే కారణంతో కోర్టు ఒక తీర్పు ఇచ్చిందని, కోర్టు నిర్ణయాన్ని అందరూ స్వాగతించాలని మంత్రి అన్నారు. అయితే, ఈ తీర్పును ఆసరాగా చేసుకుని బీఆర్ఎస్, బీజేపీలు పరీక్షను రద్దు చేయాలని కోరుతూ రాక్షసానందం పొందుతున్నాయని, ఇది దురదృష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగుల పక్షాన నిలబడి, బాధ్యతగల ప్రతిపక్షంగా ప్రభుత్వానికి సూచనలు, సలహాలు ఇవ్వాలని మంత్రి హితవు పలికారు. న్యాయపరమైన చిక్కులను అధిగమించి ముందుకు వెళ్లడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ఆయన హామీ ఇచ్చారు.

## సర్కార్ నడుపుతున్నారా.. సర్కస్ నడుపుతున్నారా..



హైదరాబాద్, సెప్టెంబర్ 12 (తీన్మార్ న్యూస్): సర్కార్ నడుపుతున్నారా?.. సర్కస్ నడుపుతున్నారా? అంటూ రేవంత్ సర్కార్‌పై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యం వల్ల నగరంలో నిన్న ఒక చిన్నారి తెరిచి ఉంచిన మ్యాన్‌హోల్‌లో పడిపోయిందని.. అదృష్టవశాత్తూ పాప ప్రాణాలు దక్కాయి. చేసిన తప్పును దిద్దుకోవాల్సిన మున్సిపల్ శాఖలోని మూడు విభాగాలేమో ఒకరిపై ఒకరు దుమ్మెత్తిపోసుకుంటున్నాయి" అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు. తప్పు హైడ్రాది అని జీహెచ్ఎంసీ ప్రకటిస్తే.. తప్పు మాది కాదు జల మండలిది అని హైడ్రా చేతులు దులుపుకుంది. ఆ వెంటనే అసలు మాకేం సంబంధం లేదని జలమండలి చేతులెత్తేసింది!. మున్సిపల్ శాఖను కేవలం కాసుల వేటకు వాడుకోవడంలో రేవంత్ బిజీగా ఉంటే, ఆయన శాఖలోని విభాగాలేమో సమన్వయలేమితో నగరవాసులకు ప్రత్యక్ష నరకం చూపిస్తున్నాయి అంటూ ఎక్స్ వేదికగా కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## దేశమంతటా బ్యాన్ చేయాలి



న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 12 (తీన్మార్ న్యూస్): పాసులపై సుప్రీంకోర్టు సంచలన కామెంట్స్ చేసింది. కేవలం ఒక్క ఢిల్లీలోనే కాకుండా దేశమంతటా బ్యాన్ చేయాలని సూచించింది. కాలుష్యం ఒక్క ఢిల్లీ ప్రజలకే కాదు.. దేశంలో అనేక చోట్ల వాయు కాలుష్యం విపరీతంగా ఉందని అత్యున్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. దేశవ్యాప్తంగా బాణసంచా కాల్చడం నిషేధించాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్ స్పష్టం చేశారు. ఈ విషయంలో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించాలని ఆదేశించింది. ఢిల్లీ–ఎన్సిఆర్ ప్రాంతంలో బాణసంచా అమ్మకం, నిల్వ, రవాణా, తయారీని నిషేధిస్తూ ఏప్రిల్ 3వ తేదీన జారీ చేసిన ఉత్తర్వుకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్ను విచారిస్తూ సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది.

## 15వ ఉపరాష్ట్రపతిగా సిపి రాధాకృష్ణన్ ప్రమాణ స్వీకారం



న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 12 (తీన్మార్ న్యూస్): శుక్రవారం రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్మ భారత ఉపరాష్ట్రపతిగా సిపి రాధాకృష్ణన్ చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్, సిపి రాధాకృష్ణన్ పూర్వీకుడు జగదీప్ ధంఖర్, అమిత్ షా, రాజ్ నాథ్ సింగ్, జెపి నడ్డా, పియూష్ గోయల్, నితిన్ గడ్కరీ వంటి కేంద్ర మంత్రులు పాల్గొన్నారు. ప్రమాణ స్వీకారం తర్వాత ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ రాజ్‌ఘాట్‌లోని మహాత్మా గాంధీకి పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. సదైవ్ అటల్‌లోని మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయికి కూడా ఆయన నివాళులర్పించారు. ఈ నెల 9న జరిగిన ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో రాధాకృష్ణన్ విజయం సాధించారు. NDA అభ్యర్థి రాధాకృష్ణన్ 452 ఓట్లను సాధించి, ఇండియా బ్లాక్ అభ్యర్థి మరియు మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి బి. సుదర్శన్ రెడ్డిని 152 ఓట్ల తేడాతో ఓడించారు. ఇంతలో, ఉపరాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్ ప్రజాసేవకు అంకితమై విజయవంతం కావాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆకాంక్షించారు. సోషల్ మీడియా పోస్ట్‌లో, శ్రీ రాధాకృష్ణన్‌ను అంకితభావంతో కూడిన ప్రజా సేవకుడిగా అభివర్ణిస్తూ, ఆయన తన జీవితాన్ని జాతి నిర్మాణం, సామాజిక సేవ మరియు ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేయడానికి అంకితం చేశారని అన్నారు.

## తెలంగాణ కాంగ్రెస్ బీసీ గర్జన సభ వాయిదా

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (తీన్మార్ న్యూస్): బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని అధికార కాంగ్రెస్ కామారెడ్డి వేదికగా బీసీ మహా గర్జన పేరిట బహిరంగ సభకు ప్లాన్ చేసిన విషయం తెలిసిందే. ఆ సభతో రాష్ట్రంలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ వర్గాల మద్దతు కూడగట్టుకోవాలని పక్కాగా వ్యూహ రచన చేసింది. ఈనెల 15న కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ విజయోత్సవ సభను పార్టీ శ్రేణులు ఏర్పాట్లు చేస్తుండగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో సభను తాత్కాలికంగా వాయిదా వస్తున్నట్లుగా శుక్రవారం ప్రకటించింది. సభకు హాజరయ్యే కార్యకర్తలు, నాయకులకు ఇబ్బందులు కలుగకూడదనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా పార్టీ వర్గాలు తెలిపాయి. తిరిగి సభను ఎప్పుడు నిర్వహిస్తామనే విషయాన్ని త్వరలోనే తెలియజేస్తామని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రకటించింది.

## కాళోజీవర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ మెరిట్ జాబితా విడుదల

హన్మకొండ, సెప్టెంబర్ 12 (తీన్మార్ న్యూస్): కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ కాంపిటెంట్ అథారిటీ కోటా కింద 2025–26 విద్యా సంవత్సరానికి గాను ఎంబీబీఎస్/ బీడీఎస్ అడ్మిషన్ల కోసం తాత్కాలిక మెరిట్ జాబితా విడుదల చేసింది. తాత్కాలిక మెరిట్ జాబితాపై అభ్యంతరాలు ఉన్న అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో సంబంధించిన పత్రాలతో తమ ఫిర్యాదులను అధికారిక వెబ్సైట్ knrugadmission@gmail.comకు 14.09.2025 సా. 05:00 గం. లేదా అంతకు ముందు గానీ సమర్పించవచ్చని తెలిపారు. తుది మెరిట్ జాబితా, వెబ్ ఎంపికలు knruhs.telangana.gov.inలో అనుసరించాలని సూచించారు.

## బాసర నుంచి భద్రాచలం వరకు టెంపుల్ సెంట్రిక్ ఘాట్స్

మొదటి పేజీ తరువాయి

వీలుగా ఘాట్లు ఉండాలని సూచించారు. ఇవాళ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో 2026లో వచ్చే గోదావరి పుష్కరాలపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. బాసర, కాళేశ్వరం, ధర్మపురి, భద్రాచలంతో పాటు ఇతర ఆలయాల జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించారు. జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారుల సమీపంలో ఉన్న గోదావరి పరీవాహక ఆలయాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న ఘాట్స్‌ను విస్తరించడంతో పాటు రోడ్లు, ఇతర సౌకర్యాలను శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. పుష్కరాల సమయంలో దాదాపు రెండు లక్షల మంది ఒకే సారి స్నానాలు ఆచరించేందుకు వీలుగా సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ప్రతి ఆలయానికి స్థానిక పరిస్థితులకు అనుగుణంగా వేర్వేరు డిజైన్లలో ఘాట్లు నిర్మించాలని అన్నారు. ఇందు కోసం పర్యాటక శాఖతో పాటు నీటిపారుదల, దేవాదాయశాఖలు కలిసి సమన్వయంతో పనిచేయాలని అన్నారు. సమావేశంలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మూడు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ, ప్రైవేట్ ఐ.టి.ఐ లలో దరఖాస్తులు ఆహ్వానం

మహబూబాబాద్ జిల్లా, సెప్టెంబర్ 12 (తీన్మార్ న్యూస్): జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ మరియు ప్రైవేటు, ఐటిఐ లలో వివిధ రకాల గ్రేడులలో ఖాళీగా ఉన్నటువంటి సీట్లను నాలుగవ దశలో వాక్ ఇన్ అడ్మిషన్ల ద్వారా తేదీ 15. 9. 2025 నుండి 30.9. 2025 మధ్యాహ్నం 1 గంట వరకు నింపబడతాయని ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపల్ ఎన్ బాబు నేడు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకుగాను అభ్యర్థులు ఎస్.ఎస్.సి పాసై ఉండాలని తేది.01.08. 2025 తేదీ నాటికి 14 సంవత్సరాలు పూర్తి అయి ఉండాలని, ఆసక్తి ఉన్న కొత్తగా చేరే అభ్యర్థులు వెబ్సైట్లో నమోదు చేసుకొని దరఖాస్తు చేసుకోవాలని, ఇప్పటికే నమోదు చేసుకున్న అభ్యర్థులు మళ్లీ నమోదు చేసుకోవాల్సిన అవసరం లేదని అన్నారు. వారు వాక్ ఇన్ అడ్మిషన్ కు నేరుగా హాజరు కావచ్చని అన్నారు. 1,2 మరియు 3 దశలలో ఏటీసీ/ ఐటిఐ, ప్రైవేటు ఐటిఐ లలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకొని అట్టి ఐటిఐ లలోనూ ప్రవేశాన్ని పొందని అభ్యర్థులు నేరుగా ప్రభుత్వ ఐటిఐ/ ఎటిసి మరియు ప్రైవేట్ ఐటిఐ లలో ప్రవేశానికి వెళ్లవచ్చునన్నారు. ఇదివరకే దరఖాస్తు చేసుకున్న వారందరూ కూడా వాక్ ఇన్ అడ్మిషన్కు అర్హులు అన్నారు. వెరిఫికేషన్ చేసుకున్నా మరియు చేసుకొని వారు కూడా అర్హులన్నారు. అడ్మిషన్ కోసం ఆన్లైన్ దరఖాస్తు తప్పనిసరి అన్నారు. అడ్మిషన్ కోసం %ష్ట్రజూం://ఱ్ఱ్.వశ్రీఖఅస్త్రుఖఖ.స్త్రశీజ.ఱఅ% వెబ్సైట్ అడ్రస్ ని సంప్రదించాలన్నారు. మధ్యాహ్నం ఒంటిగంట వరకు స్వీకరించబడిన దరఖాస్తులను వాక్ ఇన్ అడ్మిషన్ కోసం పరిశీలనలోకి తీసుకుంటారని తర్వాత వచ్చినవి తదుపరి రోజుకు స్వీకరించబడతాయని అన్నారు. 1,2 దశలలో అడ్మిషన్లలో సీట్లు పొందిన అభ్యర్థులు ఇతర ఐటిఐ లలో వెళ్లడానికి ఎంపికలను సమర్పించాలని స్లైడింగ్ ద్వారా అడ్మిషన్ పొందిన అభ్యర్థులు సవరించిన కేటాయింపులకు వెళ్లాలన్నారు. ప్రత్యేక ఐటిఐ లలో అడ్మిషన్ కోరుకునే అభ్యర్థులు సంబంధిత ఐటిఐలకు నేరుగా హాజరు కావాలన్నారు. ప్రతిరోజు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు మాత్రమే ఈ అవకాశం కలదని అన్నారు. ప్రభుత్వ ఐటిఐ/ ఏటిసి మరియు ప్రైవేటు ఐటిఐ లలో సీట్ల లభ్యతను బట్టి ప్రతిరోజు ఉదయం అప్డేట్ చేస్తామన్నారు. అభ్యర్థి తమకు ఆసక్తి ఉన్న ట్రేడ్లలో ఆరోజు ఖాళీలు అందుబాటులో ఉన్న చోటుకు హాజరు కావచ్చునని తెలిపారు. ఈ అడ్మిషన్ ప్రక్రియ మొత్తం తేదీ 15. 9. 2025 నుండి 30.9. 2025 మధ్యాహ్నం 1 గంట వరకు ఉంటుందన్నారు. ఆన్లైన్లో దరఖాస్తులు తేదీ 12. 9. 2025 నుండి స్వీకరించబడతాయని ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

# హైకోర్టు తీర్పును ప్రభుత్వం అమలు చేయాలి




మల్లంపల్లి, సెప్టెంబర్ 12 (తీన్మార్ న్యూస్): గ్రూపు 1 పరీక్షలకు సంబంధించి హైకోర్టు ఇచ్చిన తీర్పును ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని మల్లంపల్లి మండల బిఆర్ఎస్ యూత్ ప్రెసిడెంట్ మొర్రిరాజు యాదవ్ ఒక ప్రకటనలో కోరడం జరిగింది. హైకోర్టు తీర్పును ఈప్రభుత్వం గౌరవిస్తూ గ్రూప్1పరీక్షలు రద్దుచేసి మళ్లీ నిర్వహించాలని కోరడం జరిగింది. టీజీపీఎస్సీ నిర్లక్ష్యం వల్లే గ్రూప్ 1 అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగింది. ఈపరీక్షల అవకతవకలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి. తప్పు చేసిన అధికారులను చట్టపరమైన చర్యలు తీసుకోకుండా ప్రశ్నిస్తున్న విద్యార్థులపై నిరుద్యోగులపై అక్రమ కేసులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. దీనికి టీజీపీఎస్సీ చైర్మన్ సభ్యులు నైతిక బాధ్యత వహించాలని తప్పు చేసిన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరడంజరిగింది. తక్షణమే పరీక్షను రద్దుచేస్తూ కొత్త నోటిఫికేషన్ ఇవ్వాలని కోరడం జరిగింది లేనియెడల గ్రూప్ వన్ అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు బి ఆర్ఎస్ విద్యార్థి విభాగం మరియు యువజన విభాగం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో టౌన్ ప్రెసిడెంట్ చీదర సంతోష్ యువజన విభాగం జిల్లాయువజన విభాగం అధికార ప్రతినిధి రేణిగుంట సురేష్ జిల్లా యూత్ నాయకులు చోటు మొహమ్మద్ రాజ్ కుమార్ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# సౌర విద్యుత్‌తో ఆర్థిక లబ్ధి

## జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్

జనగామ జిల్లా, సెప్టెంబర్ 12 (తీన్మార్ న్యూస్): శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశపు హాల్లో విద్యుత్ శాఖ ఇంజనీర్లకు సౌర విద్యుత్ ను విస్తృత పరచాలని గొప్ప ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నటువంటి PM - సూర్య ghar ముఫ్త్ బిజిలి యోజన' పైన రెండు రోజుల శిక్షణ తరగతుల కార్యక్రమం చేపట్టారు. రూరల్ ఎలెక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ (REC), జాతీయ విద్యుత్ శిక్షణా సంస్థ (NPTI), బెంగళూరు ఆధ్వర్యంలో డైరెక్టర్ వెంకట సుబ్బయ్య, విద్యుత్ శాఖ విశ్రాంత చీఫ్ ఇంజనీర్ దుర్గా ప్రసాద్ లు TGNPDCL ఇంజనీర్లకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యుత్ కు ప్రత్యామ్నాయంగా కేంద్ర ప్రభుత్వం సౌర విద్యుత్తుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సౌర విద్యుత్ వినియోగంతో వినియోగదారులు ఆర్థికంగా లబ్ది పొందవచ్చునని తెలియజేశారు. లబ్ధిదారులు తమ ఇళ్ల పైన, ఉపయోగంలో లేని వ్యవసాయ భూములలో సౌర విద్యుత్ ప్యానెల్లని ఏర్పాటు చేసుకున్నట్లయితే వారికి విద్యుత్ బిల్లుల రూపంలో డబ్బు ఆదా అవుతుందని అంతేకాకుండా గ్రిడ్ కి కనెక్ట్ చేయడం ద్వారా ప్రత్యామ్నాయంగా ఆదాయం వస్తుందన్నారు. ప్రస్తుతం జిల్లాలో కేవలం 317 సౌర విద్యుత్ నెట్ మీటర్ కనెక్షన్లు ఉన్నాయని, ఈ సంఖ్యను పెంచడానికి అధికారులు, ఇంజనీర్లు సిబ్బంది మరింతగా కృషి చేయాలన్నారు. సౌర విద్యుత్ ప్యానెల్లు ఏర్పాటు చేసుకొని తోటి వినియోగదారులకు ఆదర్శంగా నిలవాలన్నారు. ప్రస్తుతం విద్యుత్ ఉత్పత్తికి వినియోగిస్తున్నటువంటి ఇంధన నిలువలు భవిష్యత్తులో కొరత ఏర్పడడంతో పాటు పర్యావరణం కాలుష్యం అయ్యే అవకాశం ఉంటుందన్నారు. ఈ పరిస్థితుల్లో సౌర విద్యుత్ మాత్రమే ఏకైక ప్రత్యామ్నాయ వనరుగా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ పథకాన్ని సాధ్యమైనంత మేరకు ప్రజల్లోకి తీసుకెళ్లి, అవగాహన కల్పించడం , గృహ నిర్మాణాల పైనే సౌర విద్యుత్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఇంజనీర్లకు కలెక్టర్ సూచించారు. జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ వేణు మాధవ్ మాట్లాడుతూ గృహ నిర్మాణాల పైన సౌర విద్యుత్ ప్యానెల్లు ఏర్పాటు చేసుకున్నట్లయితే ప్రభుత్వం నుండి 1 కిలో వాట్ కు 30వేల రూపాయలు, 2 కిలో వాట్లకు 60వేల రూపాయలు, 3 కిలో వాట్లకు 78వేల రూపాయలు సబ్సిడీ లభిస్తుందన్నారు. సుమారు 300 యూనిట్లు వినియోగించే వినియోగదారుడికి ఒక సంవత్సరంలో దాదాపు 20వేల రూపాయలు విద్యుత్ బిల్లుల రూపంలో డబ్బు మిగులుతుందని చెప్పారు. శిక్షణా తరగతులను అధికారులు, ఇంజనీర్లు సద్వినియోగం చేసుకొని సౌర విద్యుత్ చేపట్టే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఏ.ఓ జయరాజ్ , డీ.ఈ. టెక్నికల్ గణేష్ , ఘనపూర్ డీ.ఈ. రాంబాబు , జనగాం డీ.ఈ. లక్ష్మీ నారాయణ రెడ్డి , సబ్ డివిజన్ల ఏ.డీ.ఈ లు, సెక్షన్ ఏ.ఈ. లు, సబ్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

# అంగన్వాడీ భవనాల నిర్మాణాలల్లో నాణ్యత పాటించాలి

## రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, సెప్టెంబర్ 12 (తీన్మార్ న్యూస్): గ్రామపంచాయతీ, అంగన్వాడీ భవనాల నిర్మాణాలల్లో నాణ్యత పాటించాలని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు తెలిపారు. శుక్రవారం మహా ముత్తారం మండలం బోర్లగూడెంలో 20 లక్షలతో నిర్మించనున్న గ్రామ పంచాయతీ, 12 లక్షలతో నిర్మించనున్న అంగన్ వాడి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి

మాట్లాడుతూ మారు మూల ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. గ్రామీణ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ, అంగన్ వాడి కేంద్రాలు, పంచాయతీ భవనాలు వంటి ప్రజా సదుపాయాలను నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. గ్రామంలో మురుగు నీరు నిల్వ ఉండకుండా మురుగు కాల్వలు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. పేదల జీవితాల్లో మార్పుకు కృషి చేస్తున్నామని ఆ క్రమంలోనే రేషన్ కార్డులు, పేదలకు, సన్న బియ్యం, 200 లోపు యూనిట్లకు ఉచిత విద్యుత్తు, 500లకే సబ్సిడీపై సిలెండర్లు, మహిళలకు ఉచిత బస్సు రవాణా సౌకర్యం కల్పించామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ట్రేడ్ ప్రమోషన్ చైర్మన్ ఐత ప్రకాష్ రెడ్డి, ఉపాధిహామీ పథకం రాష్ట్ర సభ్యులు రమేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజా బాపు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పంతకాని తిర్మల సమ్మయ్య, పి ఆర్ ఈఈ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



# యూరియా పంపిణీ, కేజీబివి, సీహెచ్సీల్లో కలెక్టర్ తనిఖీ



మహబూబాబాద్ జిల్లా, సెప్టెంబర్ 12 (తీన్మార్ న్యూస్): శుక్రవారం జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ జిల్లాలోని గార్ల , డోర్నకల్ మండలాలో కొనసాగుతున్న యూరియా సరఫరా ప్రక్రియ, కేజీబివి, కమ్యూనిటీ హెల్త్ సెంటర్స్ లను అకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లాలో కొనసాగుతున్న యూరియా పంపిణీ సరఫరా కార్యక్రమాన్ని ప్రతి ఒక్క అధికారి అంకితభావంతో పనిచేస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పక్కా ప్రణాళిక ప్రకారం యూరియా సరఫరా చేస్తూ వచ్చే యూరియా కు సంబంధించి ముందస్తు సమాచారం ఇస్తూ పూర్తిస్థాయిలో జిల్లా యంత్రాంగం నిమగ్నమై ఉన్నారని, ఈ రోజు గార్ల ప్రాథమిక సహకార సొసైటీ (222), ములకనూరు, (222), డోర్నకల్ మండలం గొల్లచర్ల ప్రాథమిక సహకార సొసైటీ లో (333) బస్తాల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. కేంద్రాల వద్ద రైతులకు త్రాగునీరు, టెంట్లు, సౌకర్యాలు కల్పించడం జరిగిందని అన్నారు. గార్ల కేజీబీవీనీ సందర్శించి తరగతి గదులను, పరిసరాలను, కిచెన్ షెడ్, డైనింగ్ హాల్, టాయిలెట్స్, లను పరిశీలించారు, పిల్లలకు అందించే డైట్ మెనూ ప్రకారం రుచికరమైన ఆహారాన్ని అందించాలని, సబ్జెక్టుల వారిగా విద్యాబోధనను అందించి ఉత్తమ విద్యార్థిని, విద్యార్థులుగా తీర్చిదిద్దాలని, షెడ్యూల్ ప్రకారం వారికి వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు.

గార్ల, డోర్నకల్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ను తనిఖీ చేసి రోగులకు అందిస్తున్న వైద్య సేవలను వారిని అడిగి తెలుసుకున్నారు సీజనల్ వ్యాధులు వస్తున్న నేపథ్యంలో సబ్ సెంటర్ పరిధిలో సిద్ధంగా ఉండాలని, సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని, మాత శిశు మరణాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇన్ పేషెంట్, ఔట్ పేషెంట్, సిబ్బంది హాజరు వివరాల రిజిస్టర్ లను తనిఖీ చేశారు. పాఠశాలలు, హాస్పిటల్స్ పరిసరాలను ఎప్పటికప్పుడు సానిటేషన్ నిర్వహిస్తూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా హెల్త్, ఎడ్యుకేషన్, న్యూట్రిషన్, సానిటేషన్, లపై ప్రత్యేక దృష్టి పెట్టి చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. రైతులకు యూరియా పంపిణీ విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం నుండి వచ్చే యూరియాను పోలీస్, వ్యవసాయ సహకార అన్ని విభాగాల సిబ్బందితో కలిసి పారదర్శకంగా వేగంగా సరఫరా చేయడం జరుగుతుందని రైతులు ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు పడవద్దని ఆయన సూచించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట ప్రత్యేక అధికారులు డిపిఓ హరిప్రసాద్, నరసింహ మూర్తి, స్థానిక తహసీల్దారులు శారద, ఇమ్మానియేల్, ఎంపీడీవో శ్రీనివాస్, వ్యవసాయ శాఖ అధికారులు రామారావు, మురళీ మోహన్, తదితరులు ఉన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లు పథకం కోసం కాల్ సెంటర్

## మరింత పారదర్శకంగా అమలు

## ఒక్క కాల్‌తో... ఫిర్యాదు

## జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



జనగామ జిల్లా, సెప్టెంబర్ 12 (తీన్మార్ న్యూస్): ఇందిరమ్మ ఇళ్ల పథకం మరింత పారదర్శకంగా అమలు చేసేందుకు అలాగె లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు రాకూడదని ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని శుక్రవారం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఒక ప్రకటనలో తెలిపారు. పేదవారి సొంతింటి కల సాకారం కోసం ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా నిర్మాణలకు సంబందించి దశలవారిగా లబ్ధిదారులకు మొత్తం రూ.5 లక్షల రూపాయల ఆర్థిక సాయం చేస్తుంది. ఈ క్రమంలో ఇల్లు నిర్మాణం సమయంలో పలు అంశాలకు సంబంధించి లబ్ధిదారుల్లో అనేక అనుమానాలు వస్తున్నాయని వీటికి సరైన సమాధానాలు చెప్పేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా కాల్ సెంటర్ ఏర్పాటు చేసిందని కలెక్టర్ పేర్కొన్నారు. హిమాయత్ నగర్‌లోని హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో దీన్ని ఏర్పాటు చేశారని రాష్ట్ర రెవెన్యూ,హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఈ కాల్ సెంటర్‌ను ప్రారంభించారన్నారు. దీనికి 1800 599 5991 టోల్ ఫ్రీ నంబర్‌ను కేటాయించారని ఉదయం 7 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు పని చేసే ఈ కాల్ సెంటర్ కి లబ్ధిదారులు, సామాన్య ప్రజల నుంచి ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి వచ్చే ఫిర్యాదులు, సమస్యలను సిబ్బంది తెలుసుకుని వాటిని నోట్ చేసుకుని సంబంధిత అధికారులకు పంపి.. పరిష్కారం అయ్యేలా చూస్తారన్నారు. అంతే కాకుండా లబ్ధిదారులే నేరుగా వెబ్ సైట్ లో వారి ఇంటి నిర్మణాలకు సంబందించిన ఫోటో లను అప్ లోడ్ చేసుకునే అవకాశాన్ని అలాగే వారి వివరాలను సమర్పిస్తే బిల్స్ స్టేటస్ ను తెలుసుకునే అవకాశాన్ని కూడా ప్రభుత్వం కల్పించదన్నారు. అర్హులైన లబ్ధిదారులు వారి సొంత ఇంటి కల ను నెరవేర్చుకునే క్రమం లో ఎలాంటి ఇబ్బందులకు గురి కాకుండా మొదటి నుండి ప్రభుత్వం అనేక రకాలుగా చర్యలు తీసుకుని ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని పూర్తి పారదర్శకంగా అమలు చేస్తుందని కలెక్టర్ తెలిపారు.

# ఏఐ లాబ్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం

## రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, సెప్టెంబర్ 12 (తీన్మార్ న్యూస్): జిల్లాలోని అన్ని పాఠశాలల్లో యుద్ధ ప్రాతిపదికన ఏఐ లాబ్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. శుక్రవారం మహా ముత్తారం మండలంలో 2 కోట్ల 30 లక్షలతో నిర్మించిన కేజీవిబి జూనియర్ కళాశాల భవన ప్రారంబోత్సవం, మండలంలోని వివిధ గ్రామాల్లో 70 లక్షలతో నిర్మించనున్న అంతర్గత రహదారుల నిర్మాణానికి, 72 లక్షలతో నిర్మించనున్న అంగన్వాడి భవనాలు, 7 గ్రామ పంచాయతీల్లో 1 కోటి 40 లక్షలతో నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో తమ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే విద్యకు పెద్ద పీట వేస్తూ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు ఏర్పాటు ద్వారా అన్ని పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. నాణ్యమైన విద్యాబోధనకు డీఎస్సీ నిర్వహించి టీచర్ల నియామకం చేపట్టామని, 10 సంవత్సరాలుగా పెండింగ్ ఉన్న ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించామని తెలిపారు. విద్యార్థులకు

కాస్మొటిక్, డైట్ చార్జీలు పెంచి నాణ్యమైన విద్య, భోజనం అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు బాగా చదివి తమ కాళ్ళపై తాము నిలబడాలన్నదే ప్రభుత్వ సంకల్పమని అన్నారు. నా కుటుంబానికి ఆర్థికంగా ఇబ్బంది లేకపోవడం వల్ల నన్ను ఆంగ్లమాధ్యమంలో చదివానని, నాలాగే విద్యార్థులు ఇంగ్లీష్ లో చదవాలని, బాలికా విద్యకు ఇబ్బంది కలగకూడదని ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో మన ప్రాంతానికి పెద్ద ఎత్తున కెజిబివి, మోడల్ పాఠశాలలను ఏర్పాటు చేశామని తెలిపారు. విద్యార్థులు ఒక ప్లాన్ ప్రకారం ప్రతి రోజు ఏదో ఒక పుస్తకం ఖచ్చితంగా చదవాలని, చదివిన చదువు తప్పక ఉజ్వల భవిష్యత్తుకు ఉపయోగ పడుతుందన్నారు. గ్రామంలో ఒక్కరు చదువుకున్నా వారు మాత్రమే కాకుండా మొత్తం గ్రామమే బాగుపడుతుందని తెలిపారు.

10 వతరగతి పరీక్షలలో వందకు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని అన్నారు. కెజిబివిలో 10 వతరగతి విద్యార్థులకు టి ఫైబర్ ద్వారా ఏ.ఐ ల్యాబ్ ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. విద్యార్థులకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని, విద్యార్థులు చక్కగా చదువుకుని గొప్ప స్థాయికి ఎదిగి మన గ్రామానికి, మన ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ,

ట్రేడ్ ప్రమోషన్ చైర్మెన్ అయిత ప్రకాష్ రెడ్డి, ఈ.జి.ఎస్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ దండు రమేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ కోట రాజాబాపు, సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్ విజయ లక్ష్మీ, మార్కెట్ కమిటీ చైర్మన్ పంతగాని తిర్మల సమ్మయ్య, డీఈఓ రాజేందర్, ఈ ఈలు, కెజిబివి ఎస్ ఓ పుష్పవతి, తహశీల్దార్ శ్రీనివాస్, ఎంపిడిఓ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ఈవీఎం గోదాములను తనిఖీ చేసిన కలెక్టర్




వరంగల్ జిల్లా, సెప్టెంబర్ 12 (తీన్మార్ న్యూస్): వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డ్ లోని జిల్లా వేర్ హౌజ్ గోదాములలో భద్రపర్చిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ల ( ఈవీఎంల)ను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి తో కలసి శుక్రవారం అధికారులు, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సాధారణ తనిఖీలలో భాగంగా ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డు లోని జిల్లాకు సంబంధించి స్ట్రాంగ్ రూమ్ లలో భద్రపర్చిన ఈవీఎంలను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టర్ పరిశీలించారు. ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ గోదాంలకు సంబంధించిన రికార్డులు, కట్టుదిట్టమైన భద్రత చర్యలు, సీసీ కెమెరాల నిరంతర పర్యవేక్షణ గురించిన వివరాలను అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా హైకోర్టు ఉత్తర్వుల ననుసరించి ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలోని వరంగల్ తూర్పు, వర్ధన్నపేట, నర్సంపేట అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పార్లమెంట్ ఎన్నికలలో వినియోగించిన ఈవీఎంలను భద్రపర్చిన గోదాం ను కూడా పరిశీలించి, జిల్లా వేర్ హౌజ్ కు తరలించారు. ఈ తనిఖీలో ఆర్డీఓ లు సత్యపాల్ రెడ్డి, రమాదేవి, తహసీల్దార్ ఇక్బాల్, ఎన్నికల నాయబ్ తహసీల్దార్ రంజిత్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు బి ఎస్ పి నుండి అనిల్, టిడిపి నుండి శ్యామ్, ఏ ఐ ఎం ఐ ఎం నుండి ఫైజోద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసింది మీరే



హైదరాబాద్, సెప్టెంబర్ 12 (తీన్మార్ న్యూస్): పార్టీ ఫిరాయింపుల ఎమ్మెల్యేల వివాదంపై ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించారు. శుక్రవారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యేలు నియోజకవర్గ అభివృద్ధి పనుల కోసం సీఎంను కలిశామని వారు చెబుతున్నారని గుర్తుకు చేశారు. పార్టీ ఫిరాయింపుల విషయంపై స్పీకర్ నిర్ణయం తీసుకుంటారని, ఆ అంశం కోర్టు పరిధిలోనిదన్నారు. దానిపై తాము ఎందుకు చర్చించాలని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం రేపు ఎల్లుండి కూలిపోతుందని బీఆర్ఎస్, బీజేపీ పార్టీ నేతలు మాట్లాడారని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయాలనే కార్యక్రమం చేస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యేలు ఏదో తప్పు చేసినట్లుగా మాట్లాడుతున్నారు. మీకు ఆ రోజు సిగ్గు లేదా? 88 స్థానాలు గెలిచిన తర్వాత కూడా గతంలో ఇతర పార్టీల ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లో చేర్చుకోలేదా? అని నిలదీశారు. మేము ఏ తప్పు చేయలేదు కదా? ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసింది మీరు మళ్లీ మీరే సిగ్గుందా అని మాట్లాడుతున్నారని కేటీఆర్‌పై మంత్రి జూపల్లి ఫైర్ అయ్యారు. ఆయన సగం మాట్లాడి సగం వదిలేస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యేలు పనుల కోసం కలిశామని చెబుతున్నా కూడా మీరు పార్టీలో చేరారు అనడం ఏంటని ప్రశ్నించారు. పార్టీ ఫిరాయింపుల విషయంలో నిర్ణయాలు చట్ట ప్రకారమే ఉంటాయని, స్పీకర్ చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటారని, సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారమే జరుగుతోందని క్లారిటీ ఇచ్చారు.

# కుల ధ్రువీకరణ పత్రాల జారీలో కొత్త విధానం

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో కుల ధ్రువీకరణ పత్రాలను జారీ చేసే ప్రక్రియను మరింత సులభతరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మీ సేవ' కేంద్రాల్లో నూతన ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఈ కొత్త విధానంతో బీసీ, ఎస్టీ, ఎస్సీ వర్గాలకు చెందిన పౌరులు ఇకపై మీ సేవాల సెంటర్ల నుంచి నేరుగా కుల ధ్రువీకరణ పత్రాలను పొందవచ్చు. ఇంతకు ముందు మనకు క్యాస్ట్ పర్టిఫికెట్ కావాలంటే దరఖాస్తు చేసుకున్నప్పుడల్లా.. ఎమ్మార్వో ఆమోదం పొందిన తర్వాతనే తీసుకోవాల్సి వచ్చింది. కొన్ని సార్లు వాళ్లు అందుబాటులో లేక పోతే.. ఈ సర్టిఫికెట్ పొందేందుకు వారం, రెండు వారాల సమయం కూడా పట్టేది. దీంతో ఈ జాప్యంపై దృష్టి సారించిన ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించేందుకు నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగానే ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాలతో మీ సేవ విభాగం, సీసీఎల్ఏ, బీసీ సంక్షేమ, ఎస్సీ సంక్షేమ, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ అధికారులు, తహసీల్దార్‌లతో సమావేశాలు నిర్వహించి ఈ కొత్త విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చాయి. గత 15 రోజుల నుంచి ఈ విధానం మీ సేవ కేంద్రాల్లో అందుబాటులో ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. ఈ తాజా మార్పుల తర్వాత ఇప్పటికే 17,571 మంది వరకు ఈ సేవలను సద్వినియోగం చేసుకున్నారు.




# గ్రామ పంచాయతీ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ





ములుగు, సెప్టెంబర్ 12 (తీన్మార్ న్యూస్): ఈరోజు అబ్బాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో తెలంగాణ గవర్నమెంట్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇల్లులేని వారికి ఇల్లు అందాలని పిలుపు మేరకు దాదాపుగా 45 మందికి ఇందిరమ్మ ఇండ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు రేవంత్ రెడ్డికి, స్థానిక మంత్రివర్యులు సీతక్కకి ధన్యవాదములు తెలియచేయడం జరిగింది. ఈ కార్యక్రమలో గ్రామ కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు,పుర ప్రముఖులు, హాజరు అయి లబ్ధిదారులకు, పట్టాలను అందించి, స్వీట్లు పంచి తమ ఆనందాన్ని చాటారు లబ్ధిదారులతోకాంగ్రెస్ పార్టీ. ఎల్లకాలం అందుబాటులో ఉంటుందని సూచించారు.

# మృతుల కుటుంబాలను పరామర్శించిన బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు

## మృతురాలి పార్థివదేహానికి పూలమాలతో నివాళులు



వెంకటాపూర్, సెప్టెంబర్ 12 (తీన్మార్ న్యూస్): తెలంగాణా రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి,స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) ఆదేశాల మేరకు, అధ్యక్షులు పైడాకుల అశోక్ సూచనలమేరకు, ములుగు జిల్లా వెంకటాపూర్ (రామప్ప) మండల కేంద్రంలోని ఈనాడు రిపోర్టర్ నరేష్ అమ్మమ్మ రెడ్డి.ఒదెమ్మ మరణించగా వారి పార్థివదేహానికి పూలమాలవేసి, నివాళులు అర్పించి, వారి కుటుంబాన్ని పరామర్శించిన బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బైరెడ్డి భగవాన్ రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బండి.శ్రీనివాస్ ల వారితోపాటు స్థానిక గ్రామకమిటీ అధ్యక్షులు చెన్నోజు.శ్రీనివాస్, కాంతాల.రాజిరెడ్డి, కందిగొండ మొగిలి మరియు తదితర నాయకులు పాల్గొన్నారు.

# తప్పు మాదే.. బాధ్యులపై చర్యలు తీసుకుంటాం

**బాలిక పడిన మ్యాన్ హెూల్ శుభ్రం చేసింది హైడ్రా సిబ్బందే**

**మ్యాన్ హెూల్ ఘటనపై హైడ్రా కమిషనర్ స్పందన**

**భవిష్యత్తులో ఇలా జరగకుండా చర్యలు తీసుకుంటాం**




హైదరాబాద్, సెప్టెంబర్ 12 (తీన్మార్ న్యూస్): యాకుత్ పురలో ఐదేళ్ల బాలిక మ్యాన్ హెూల్‌లో పడిన ఘటనపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పందించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గురువారం ఉదయం యాకుత్ పురలో ఐదేళ్ల బాలిక మ్యాన్ హెూల్‌లో పడింది. వెంటనే వాల్ల నాన్నమ్మ బయటికి తీసిందని తెలిపారు. హైడ్రా వల్లే తప్పు జరిగినట్లు గుర్తించామన్నారు రంగనాథ్. ఈ ఘటనకు బాధ్యులైన హైడ్రా సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. బాలిక మ్యాన్ హెూల్‌లో పడిన చుట్టుపక్కల నాలుగైదు మ్యాన్ హెూల్స్ ఉన్నాయని అందులో ఒకటి వాటర్ బోర్డు వాళ్ళు క్లీన్ చేశారని చెప్పారు. అయితే బాలిక పడిన మ్యాన్‌హెూల్ మాత్రం హైడ్రా సిబ్బందే క్లీన్ చేశారని హైడ్రా వల్లే తప్పు జరిగిందని అంగీకరించారు రంగనాథ్. మంచి చేస్తేనే మా ఖాతాలో వేసుకోవడం కాదు తప్పు జరిగినప్పుడు కూడా ఒప్పుకుంటున్నామని పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ, వాటర్ బోర్డు, హైడ్రా మధ్య ఎలాంటి సమన్వయ లోపం లేదని తెలిపారు రంగనాథ్. జీహెచ్ఎంసీ పెద్ద ఆర్గనైజేషన్ అని మేము ఎవరిపై పెత్తనం చెలాయించట్లేదని చెప్పారు. మా అందరికీ బాస్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉన్నారని స్పష్టం చేశారు. ఈ ఘటనపై రాజకీయ పరంగా చేసే కామెంట్స్‌పై మేం స్పందించమని చెప్పారు. ఫ్యూచర్‌లో మళ్ళీ ఇలాంటి తప్పు రిపీట్ కాకుండా చూసుకుంటామని పేర్కొన్నారు. మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్స్‌కి డీఆర్ఎఫ్ టీమ్ ఇంచార్జ్‌గా ఉన్నారని ఆయనపై చర్యలు ఉంటాయని తెలిపారు. నగరంలో ఉన్న మ్యాన్ హెూల్స్‌పై ఆడిట్ చేస్తున్నామని మూతలు సరిగా లేనివి గుర్తించి సంబంధిత ఏజెన్సీకి సెక్రెటరీ ద్వారా రిఫర్ చేస్తామని చెప్పారు.

హైడ్రాకు శాంక్షన్ అయిన బడ్జెట్‌లో ఒక క్వార్టర్ ది మాత్రమే రిలీజ్ అయిందని తెలిపారు. హైడ్రా పోలీస్ స్టేషన్‌లో త్వరలో కేసులు నమోదు చేస్తామని చెప్పారు. సున్నం చెరువులో పనులు ఆపమని కోర్టు నుంచి ఎలాంటి ఆర్డర్ లేదని వెల్లడించారు. బతుకమ్మ కుంట పనులు పూర్తవబోతున్నాయని త్వరలోనే సీఎం ఆధ్వర్యంలో బతుకమ్మ కుంట ప్రారంభిస్తామని తెలిపారు. ఈసారి బతుకమ్మ పండగ అక్కడ జరిగేలా ప్లాన్ చేస్తున్నామని చెప్పారు.



# దేశాన్ని దారిలో పెట్టాల్సిన బాధ్యత యువతదే!

ఒకప్పుడు జాతీయ రాజకీయాల్లో దక్షిణాది నేతలదే హవాగా ఉండేది. ఇప్పుడు అంతగా కనిపించడం లేదు. ముఖ్యంగా తెలు గు వారు జాతీయ రాజకీయాల్లో అరుదుగా ఉన్నారు. క్రమంగా ఒక్కొకరే కనుమరుగు అవుతున్నారు. కొత్త తరం రావాల్సి ఉన్నా రావడంలేదు. యువత రాజకీయాల్లో రాణించాల్సి ఉంది. దేశం అనేక సమస్యలు ఎదుర్కొంటున్న వేళ కొత్త తరాన్ని ఆహ్వానించాలి. రాజకీయాల్లో కూడా రిజర్వేషన్లు రావాలి. రిజర్వేషన్లు వస్తేనే పదవులు పట్టుకుని వేలాడుతున్న వారి స్థానంలో కొత్త రక్తం వస్తుంది. సర్పంచ్ నుంచి, ఎమ్మెల్యేలు, ఎంపిలకు కాలపరిమితి విధించుకోవాల్సి ఉంది. దేశం మూస పద్ధతిలో నడవడం వల్లనే బంగ్లాదేశం, నేపాల్‌లో తిరుగుబాట్లు వచ్చాయి. నేపాల్‌లో యువతే ముందుకు కదిలింది. రాజకీయ స్వార్థంతో తీసుకున్న నిర్ణయాలను నిరసించడం ద్వారా దేశాన్ని కదిలించారు. దేశం ఏదైనా పదవీకాంక్షతో చేస్తున్న రాజకీయాల వల్ల ఆ దేశం పురోగమించడం లేదు. మనదేశంలోనూ ఇలాంటి సమస్యలే ఉన్నాయి. వీటిని నిలదీయాల్సి ఉంది. అందువల్ల యువతరం కొత్త ఆలోచనలతో రాజకీయాల్లో అడుగు పెట్టాల్సి ఉంది. పివి నరసింహారావు, జైపాల్ రెడ్డి, పర్వతనేని ఉపేంద్ర, సీతారాం ఏచూరి, సురవరం సుధాకర్ రెడ్డి లాంటి నేతల మరణం తరవాత అంతగా ప్రభావితం చేయగలిగిన నేతలు రావడం లేదు. వెంకయ్యనాయుడు పదవీ విరమణ తరవాత రాజకీయాలకు పూర్తిగా దూరంగా ఉన్నారు. దీంతో తెలుగువారి పాత్ర అంతకంతకూ కనుమరుగు అవుతోంది. ముఖ్యంగా జాతీయ రాజకీయాల్లో తెలుగు వారి పాత్ర లేకుండా పోతోంది. పూర్వపు ఎన్‌డిఎలో చంద్రబాబు నాయుడు కన్వీనర్‌గా బాగానే రాణించారు. ఒకప్పుడు ప్రధాని, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి స్థాయికి ఎదిగిన నేతలు ఇప్పుడు అక్కడ కనిపించడం లేదు. చక్రం తిప్పే స్థాయి నుంచి ఇప్పుడంతా తెరమరుగు అవుతూ వచ్చారు. గతేడాది సీతారాం ఏచూరి మరణం, మొన్నీ మధ్యనే వయోభారంతో సురవరం సుధాకర్ రెడ్డి మరణంతో జాతీయస్థాయిలో నిలువగలిగిన నేతలు లేకుండా పోయారు. ఒకప్పుడు సర్వేపల్లి రాధాకృష్ణ, నీలం సంజీవరెడ్డి, పివి నరసింహారావు, కోట్ల విజయ భాస్కర్ రెడ్డి వంటి ఉద్దండులు జాతీయ రాజకీయాల్లో తమదైన ముద్ర వేశారు. తరవాత జైపాల్ రెడ్డి, విద్యాసాగర్ రావు, వెంకయ్యనాయుడు, సురవరం సుధాకర్ రెడ్డి, సీతారాం ఏచూరిలు కనిపించేవారు. ఇప్పుడు ఒక్కొక్కరే అదృశ్యమవుతూ వచ్చారు. ఉపరాష్ట్రపతి పదవి విరమణ తరవాత వెంకయ్య నాయుడు జాతీయ రాజకీయాలకు దూరంగా ఉన్నారు. కరీంనగర్‌కు చెందిన సిహెచ్ విద్యాసాగర్ రావు గవర్నర్ పదవి తరవాత ఇంటికే పరిమితం అయ్యారు. నిజానికి కెసిఆర్ జాతీయ రాజకీయాల్లో కొనసాగివుంటే మంచి నేతగా రాణించేవారు. ఆయన కూతురు కవితను జాతీయ రాజీయాల్లో కొనసగించినా ఆమె మంచి పట్టు సాధించేవారు. ఎందుకంటే కవిత మంచి ఇంగ్లీష్, హిందీ, ఉర్దూలలో మాట్లాడగలిగే సత్తా ఉన్న నేత. కానీ కెసిఆర్ ఎందుకనో ఆ వైపుగా ఆలోచించలేదు. ఇవాళ ఆమె ఢిల్లీ రాజకీయాల్లో ఉండివుంటే బిఆర్‌ఎస్‌కు ఇప్పుడీ దుర్గతి పట్టివుండేది కాదు. కెసిఆర్ స్వార్థ, కుటుంబ రాజకీయాల్లో పడిపోవడం వల్ల తనకున్న అవకాశాలను కోల్పోయారనే చెప్పాలి. తెలంగాణ సాధించిన తరవాత కుటుంబ రాజకీయాలను పక్కన పెట్టివుంటే కెసిఆర్ అద్భుతంగా రాణించే వారు. భాషాపటిమ, వాక్చాతుర్యం కూడా అద్భుతంగా ఉన్న నేతగా కెసిఆర్ దేశ ప్రజలకు సుపరిచితం.కుటుంబ రాజకీయాలతో ఆయన తనకున్న ఇమేజ్‌ను దెబ్బ తీసుకున్నారు. లేకుంటే జాతీయ రాజకీయాల్లో ఓ వెలుగు వెలిగేవారు. జాతీయ రాజకీయాల్లో మనపాత్ర లేకుంటే ఉత్తరాది వారి పెత్తనం సాగనుంది. ఇప్పటికే బిజెపిలో కేవలం గుజరాత్ పెత్తనమే సాగుతోంది. దేశంపై వారిద్దరే అజమాయిషీ చెలాయిస్తున్నారు. అమిత్ షాకు ఇంగ్లీష్ అంతగా వచ్చినట్లు ఎక్కడా చూడలేదు. కానీ హోంమంత్రిగా నెట్టుకు వస్తున్నారు. జాతీయ రాజకీయాల్లో రాణించాలంటే హిందీ, ఆంగ్లంపై పట్టుతో ముందుకు సాగాల్సి ఉంటుంది. అలాగే దేశ రాజకీయాలను ఔపోసన పట్టాలి. సమస్యలపై అవగాహన ఉండాలి. వాటిపై పోరాటం చేసే సత్తా ఉండాలి. అప్పుడే రాణించగలరు. తెలుగుదేశం నుంచి కేంద్ర విమానాయన మంత్రి బాధ్యతలు నిర్వహిస్తున్న రామ్మోహన్ నాయుడు కొంత లోటు పూడ్చే అవకాశాలు లేకపోలేదు. అయితే పార్టీ ఆయనకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చినప్పుడే ఇది సాధ్యం. ఎందుకంటే రామ్మోహన్ నాయుడు కూడా బాగా చదువుకున్న వాడే కాకుండా యువకుడు. చంద్రబాబు ఆయనకు బాగానే ప్రోత్సాహం ఇస్తున్నారు. ఇంగ్లీష్, హిందీలపై బాగా పట్టు సాధించారు. సమస్యలపై అవగాహన ఉంది. అనర్గళంగా మాట్లాడే స్వభావం ఉంది. పార్లమెంటులో చర్చల్లో ఆయన బాగా రాణిస్తున్నారు. ఢిల్లీ స్థాయిలో పార్టీ వ్యవహారాల్లో కూడా రామ్మోహన్ నాయుడును ప్రోత్సహిస్తే తెలుగుదేశం పార్టీకి మంచి బలం లభించగలదు. తెలంగాణ కు చెందిన కెఆర్ సురేశ్ రెడ్డి కూడా మంచి వక్త. హిందీ, ఇంగ్లీష్‌లలో కూడా ఆయన దిట్ట. కానీ బిఆర్‌ఎస్ ఆయన వాణిని వినియోగంచు కోవడం లేదు. ఇకపోతే దక్షిణాదికే వస్తే...నిర్మలా సీతారామన్ కూడా మంచి వక్త. సమస్యలపై అవగాహన ఉన్న నేత. ఆంగ్లం, హిందీల్లో బాగా పట్టుంది. అయితే ఆమె కేవలం రబ్బర్ స్టాంప్ రాజకీయాలకు అలవాటు పడ్డారు. పార్టీ లైన్ కన్నా, మోడీ లైన్‌లోనే ఆమె మసలుకోవాల్సి ఉంది. ఈక్రమంలో యువత రాజకీయాల్లో రావడానికి మంచి అవకాశం ఉంది. అందుకు ప్రస్తుతం ఖాళీ కూడా ఉంది. దీనిని పూడ్చగలిగే సత్తా ఉన్న నేతలు ముందుకు సాగితే మంచిది.



# ఉపరాష్ట్రపతిగా రాధాకృష్ణన్ ప్రమాణం

- రాష్ట్రపతి భవన్‌లో ప్రమాణం చేయించిన ద్రౌపది ముర్ము
- హాజరైన ప్రధాని మోడీ, పలువురు ప్రముఖులు





**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12:** భారత నూతన ఉప రాష్ట్రపతిగా సీపీ రాధాకృష్ణన్ శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రమాణస్వీకారం చేశారు. రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆయనతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీతోపాటు-, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీ, సుప్రీం చీఫ్ జస్టిస్ గవాయ్, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. మాజీ రాష్ట్రపతులు, మాజీ ప్రధానులు, మాజీ ఉప రాష్ట్రపతులనూ ఈ కార్యక్రమానికి ఆహ్వానించారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఉప రాష్ట్రపతులు జగదీప్ ధన్‌ఖడ్, వెంకయ్యనాయుడు, హమీద్ అన్సారీ తదితరులు కూడా హాజరయ్యారు. కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, పియూష్ గోయెల్, ధర్మేంద్ర ప్రదాన్ సహా పలువురు కేంద్ర మంత్రులు, లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, ఎన్డీయే కూటమికి చెందిన నేతలు, ఎంపీలు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. ఉప రాష్ట్రపతి ఎన్నికకు ఈనెల 9న జరిగిన పోలింగ్‌లో ఎన్డీయే కూటమి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ తన సమీప ప్రత్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిపై 152 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఎన్నిక లాంఛనాలన్నీ పూర్తి కావడంతో గురువారం మహారాష్ట్ర గవర్నర్ పదవికి సీపీ రాధాకృష్ణన్ రాజీనామా చేశారు. దీంతో మహారాష్ట్ర బాధ్యతలను గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్‌కు రాష్ట్రపతి ముర్ము అప్పగించారు. ఆర్‌ఎస్‌ఎస్, జన్‌సంఘ్ లాంటి సంస్థలతో 16 ఏండ్లకే రాధాకృష్ణన్ రాజకీయ జీవితం ప్రారంభమైంది. 1996లో తమిళనాడు బీజేపీ కార్యదర్శిగా, 2003 నుంచి 2006 మధ్య అధ్యక్షుడిగా పనిచేశారు. ఆ సమయంలో ఆయన రాష్ట్రంలో 93 రోజుల పాటు 19 వేల కి.మీ రథయాత్ర నిర్వహించారు. 2024, జూలై 31న ఆయన మహారాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు జార్ఖండ్ గవర్నర్‌గా ఏడాదిన్నర పాటు చేశారు. తెలంగాణ ఇన్‌చార్జి గవర్నర్‌గా, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గానూ పనిచేశారు. 1998, 1999లో కోయంబత్తూర్ నుంచి ఆయన రెండుసార్లు ఎంపీగా చేశారు. అభిమానులు ఆయనను తమిళనాడు మోదీగా పిలుస్తారు.

# నేపాల్‌లో దారుణ ఘటన

## హోటల్‌కు నిప్పు పెట్టిన దుండగులు ● యూపీకి చెందిన మహిళ మృతి



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12:** పొరుగు దేశం నేపాల్‌లో జడ్ జనరేషన్- యువత నిర్వహిస్తున్న ఆందోళనలు తారాస్థాయికి చేరాయి. ఆర్మీ కంట్రోల్‌లోకి తీసుకున్న తర్వాత పరిస్థితులు కాస్త చక్కబడినట్లే కనిపించినా.. అక్కడక్కడ నిరసనకారులు పేట్రేగిపోతున్నారు. నిరసనల్లో భాగంగా ఒక హోటల్‌కు నిప్పు పెట్టడంతో భారత్‌కు చెందిన మహిళ చనిపోవడం దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. ఉత్తరప్రదేశ్ ఘజియాబాద్‌కు చెందిన రాజేశ్ గోలా అనే 57 ఏళ్ల మహిళ చనిపోయింది. టూర్‌కు వెళ్లిన కుటుంబం హయత్ రెజెన్సీలో ఉండగా, ఆందోళన కారులు నిప్పు పెట్టారు. హోటల్ మంటల్లో చిక్కుకోవడంతో దూకి పారిపోయే ప్రయత్నంలో ప్రాణాలు కోల్పోయినట్లు ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు. మంటలు పూర్తిగా వ్యాపించడంతో భయంతో ఒక్కసారిగా బిల్డింగ్ మీది నించి జంప్ చేసింది. దీంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆమె భర్త రాంవీర్ సింగ్ గోలా ఆమెను ఖాట్మండులోని త్రిభువన్ యూనివర్సిటీ ఆస్పత్రికి తరలించాడు. అప్పటికే ఆమె చనిపోయినట్లు వైద్యులు ప్రకటించారు.

# ఈ యేడాది చివర్లో భారత్‌కు ట్రంప్

## క్వాడ్ దేశాధినేతల సమావేశాల్లో పాల్గొనే ఛాన్స్



**వాషింగ్టన్, సెప్టెంబర్ 12:** రష్యా చమురు కొనుగోలు కారణం చూపి ట్రంప్ విధించిన భారీ సుంకాలతో భారత్-అమెరికా మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. ప్రస్తుతం రెండు దేశాల మధ్య సుంకాల వివాదం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో కీలక పరిణామం చోటు- చేసుకుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్ట్ ట్రంప్ ఈ ఏడాది చివర్లో భారత్‌కు వచ్చే అవకాశం ఉంది. ఈ ఏడాది నవంబర్‌లో భారత్‌లో జరగనున్న క్వాడ్ దేశాధినేతల సదస్సుకు ట్రంప్ హాజరయ్యే అవకాశం ఉన్నట్లు- భారత్‌కు కాబోయే అమెరికా రాయబారి సెర్గీ గోర్ వెల్లడించారు. ఈ సదస్సు కోసం ఆయన ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. ఈ పర్యటనకు సంబంధించి ఇంకా చర్చలు జరుగుతున్నాయని వివరించారు.

# స్పైస్‌జెట్ విమానానికి తప్పిన ముప్పు

## టేకాఫ్ సమయంలో ఊడిన చక్రం ● ముంబైలో క్షేమంగా దిగిన విమానం




**ముంబై, సెప్టెంబర్ 12:** ఓ స్పైస్‌జెట్ విమానానికి ఊహించని ప్రమాదం ఎదురైంది. టేకాఫ్ సమయంలోనే విమాన చక్రాల్లో ఒకటి ఊడిపోయింది. అయినప్పటికీ ప్రయాణాన్ని కొనసాగించిన ఆ విమానం ముంబయి విమానాశ్రయంలో సురక్షితంగా దిగింది. దీంతో ప్రయాణికులు సహా సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. ముందస్తుగా ఎమర్జెన్సీ ప్రకటించిన అధికారులు సంబంధిత చర్యలు చేపట్టారు. విమాన ల్యాండింగ్‌కు సంబంధించి వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. గుజరాత్‌లోని కండ్లా నుంచి ముంబయికి క్యూ400 స్పైస్‌జెట్ విమానం శుక్రవారం మధ్యాహ్నం బయలుదేరింది. ఆ సమయంలో విమానంలో 75 మంది ప్రయాణికులు ఉన్నారు. అయితే, టేకాఫ్ అయిన వెంటనే విమాన చక్రాల్లో ఒకటి రన్‌వేపైనే ఊడిపోయింది. విమానం నుంచి ఏదో వస్తువు పడినట్లు- గుర్తించిన ఎయిర్‌పోర్టు టవర్ కంట్రోల్ అధికారులు.. రన్‌వేపైకి తనిఖీ బృందాలను పంపించారు. విమానం -టైరు అని గుర్తించిన వెంటనే అప్రమత్తమయ్యారు. ముంబయి విమానాశ్రయ అధికారులకు సమాచారం అందించారు. కుడివైపు ఉన్న రెండు- టైర్లలో ఒకటి ఊడిపోయినట్లు- సమాచారం. దీంతో ఎమర్జెన్సీ ప్రకటించిన పైలట్లు-.. సురక్షితంగా దించారు. ఈ ఘటనను విమానయాన సంస్థ ధ్రువీకరించింది. విమానం సొంతశక్తితోనే -టె-ర్మినల్‌కు చేరుకుందని, ప్రయాణికులు సురక్షితంగా దిగారని వెల్లడించింది.

# సుప్రీంకోర్టు ఆవరణలో నిషేధాజ్ఞలు

## రీల్స్ తదితర కార్యకలాపాల నిషేధం

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12:** సుప్రీంకోర్టు ప్రాంగణంలోని హై సెక్యూరిటీ జోన్‌లో ఫొటోలు, రీల్స్ చేయడం, వీడియోలు తీయడంపై సర్వోన్నత న్యాయస్థానం నిషేధం విధిస్తూ సర్క్యులర్ జారీ చేసింది. సెప్టెంబరు 10న జారీచేసిన ప్రకటనలో మీడియా సిబ్బంది ఇంటర్వ్యూలు, వార్తలకు సంబంధించిన ప్రత్యక్ష ప్రసారాలను కేవలం భద్రతా ప్రమాణాలకు అనుగుణమైన జోన్‌లో మాత్రమే నిర్వహించాలని సుప్రీంకోర్టు పేర్కొంది. కోర్టు ప్రాంగణంలో అధికారిక వినియోగానికి మినహా, వీడియోగ్రఫీ, రీల్స్ చేయడానికి, ఫొటోలు తీయడం కోసం ఉపయోగించే ఫోన్స్, కెమెరా, -ట్రైపాడ్, సెల్ఫీ స్టిక్ వంటి పరికరాలను న్యాయస్థానం నిషేధించింది. ఈ మార్గదర్శకాలను ఉల్లంఘించిన వారిపై బార్ అసోసియేషన్ లేదా రాష్ట్ర బార్ కౌన్సిల్ తగిన చర్యలు తీసుకోవాలి. మీడియా సిబ్బంది, నిబంధనలను అతిక్రమిస్తే ఆ మీడియాకి నెల పాటు- ప్రాంగణంలోకి అడుగు పెట్టకుండా ఆదేశాలు ఇవ్వవచ్చు. కోర్టు సిబ్బంది లేదా రిజిస్ట్రీ, సంబంధిత ఉన్నత అధికారులు ఉల్లంఘనలకు పాల్పడితే తీవ్రంగా పరిగణిస్తూ.. వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటాం అని సర్క్యులర్‌లో పేర్కొంది. హై సెక్యూరిటీ- జోన్‌లో సిబ్బంది, న్యాయవాదులు లేదా ఇతరులు ఫొటోలు లేదా వీడియోలు తీయకుండా నిరోధించే హక్కు భద్రతా సిబ్బందికి ఉంటుందని జారీ చేసిన సర్క్యులర్‌లో పేర్కొంది.

# డీజిల్‌లో ఐసోబుటనాల్ మిశ్రమం

## ఇందన ధరల దృష్ట్యా ప్రయోగం

## కేంద్రమంత్రి గడ్కరీ వెల్లడి



**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 12:** దేశంలో ఇంధన దిగుమతుల ఖర్చును తగ్గించేందుకు ఇథనాల్ కలుపుతున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ఇ20 పెట్రోల్ వాడకం గురించి వాహనదారుల్లో ఉన్న అపోహలపై కేంద్రం క్లారిటీ- ఇచ్చింది. అయితే తాజాగా ఇథనాల్‌కు బదులుగా ఐసోబుటనాల్‌ను డీజిల్‌లో కలపనున్నట్లు- కేంద్ర రోడ్డు రవాణా మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడించారు. డీజిల్‌లో ఇథనాల్‌ను కలిపే ప్రయోగం విజయవంతం కాలేదని.. అందువల్ల దానికి బదులుగా ఐసోబుటనాల్ మెరుగైనది గుర్తించినట్లు- చెప్పారు. డీజిల్‌లో ఇథనాల్ మిక్స్ చేసినప్పుడు ఇంజిన్ సమస్యలతో పాటు- కొన్ని సాంకేతిక సమస్యలు వచ్చాయని చెప్పారు. బయోఫ్యూయల్ మిక్సింగ్ విదేశీ కరెన్సీని ఆదాచేయటంతో పాటు- భారీ ఫ్యూయెల్ బిల్లుల నుంచి ఉపశమనం కల్పిస్తుందని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. పెట్రోల్ లో ఇథనాల్ మిక్సింగ్ పై సోషల్ మీడియాలో తనపై కావాలనే తప్పుడు ప్రచారం కొనసాగించాలని గడ్కరీ ఇటీవల అన్నారు. అవి పూర్తిగా పెట్రోల్ లాబీ స్పాన్సర్ చేసిన పెయిడ్ ప్రచారం అన్నారు గడ్కరీ. ఈ20 ఇంధనానికి వ్యతిరేకంగా జరుగుతున్న ప్రచారం రాజకీయంగా ప్రేరేపించబడిందని అన్నారు. ఇథనాల్ వల్ల వాహనాల ఇంజన్లు పాడవుతాయనం పూర్తిగా నిరాధారమైనదిగా కొట్టిపడేశారు. కానీ కొందరు నిపుణులు మాత్రం ఇథనాల్ వల్ల పాత వాహనాల్లో ఇంజిన్లో తుప్పు, రబ్బర్ భాగాలు పడవటం జరుగుతుందని అంటున్నారు. మైలేజ్ కూడా దెబ్బతింటు-ందని చెబుతున్నారు. ప్రస్తుతం డీజిల్ విషయంలో ఐసోబుటనాల్ కలపాలనుకోవటానికి కారణం అందులో ఇథనాల్ కంటే ఎక్కువ ఎనర్జీ ఉండటమే. డీజిల్‌లో కలిపినప్పుడు ఇంజిన్ పనితీరు మెరుగుపడి కాలుష్యం కూడా తగ్గినట్లు- గుర్తించారు. ఇథనాల్ మాదిరిగానే ఐసోబుటనాల్ కూడా చెరకు, మొక్కజొన్న వంటి పంటల నుంచి తయారు చేస్తారు. ఇక్కడ అసలు సమస్య ఏంటంటే ఐసోబుటనాల్‌ను పెద్ద ఎత్తున ఉత్పత్తి చేయడమే. దీని శుద్ధికి కర్మాగారాలకు నూ టెక్నాలజీ అవసరం ఉందని తెలుస్తోంది.

# విటమిన్ బి12 లోపిస్తే ఎలాంటి లక్షణాలు కనిపిస్తాయి..?

## ఎందుకు ఈ లోపం వస్తుంది..? ఏయే ఆహారాలను తినాలి..?

మన శరీరానికి కావల్సిన అనేక విటమిన్లలో విటమిన్ బి12 కూడా ఒకటి. దీన్నే సయానో కోబాలమైన్ లేదా కోబాలమైన్ అని పిలుస్తారు. మన శరీరంలో అనేక జీవక్రియలను సరిగ్గా నిర్వహించడంలో విటమిన్ బి12 ముఖ్య పాత్ర పోషిస్తుంది. నాడీ మండల వ్యవస్థ పనితీరును మెరుగు పరుస్తుంది. ఎర్ర రక్త కణాలు ఉత్పత్తి అయ్యేలా చేస్తుంది. డీఎన్ఏ సంశ్లేషణకు సహాయం చేస్తుంది. విటమిన్ బి12 లోపం వల్ల అనేక అనారోగ్య సమస్యలు వస్తాయి. ఇవి కొందరిలో పలు లక్షణాలను కలగజేస్తాయి. విటమిన్ బి12 లోపం వల్ల కొందరిలో ఎలాంటి లక్షణాలు కనిపించవు. కానీ కొందరిలో స్వల్ప లేదా తీవ్రమైన లక్షణాలు కనిపిస్తాయి. ఇవి ఒక్కొక్కరిలో వేర్వేరుగా ఉంటాయి. విటమిన్ బి12 లోపం వచ్చేందుకు అనేక కారణాలు ఉంటాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.




**ఎందుకు వస్తుంది..?**

విటమిన్ బి12 మనకు అధికంగా మాంసం లేదా జంతు సంబంధ ఉత్పత్తుల్లో లభిస్తుంది. అందువల్ల మాంసాహారాల్లో ఈ సమస్య కనిపించడం అరుదు. శాకాహారుల్లో, కనీసం కోడిగుడ్లు తినని వారు లేదా పాలు తాగని వారు, పెరుగు, నెయ్యి వంటివి కూడా తినని వారిలో ఈ విటమిన్ లోపం ఏర్పడుతుంది. కొందరు మాంసాహారం తింటున్నా ఇతర పోషకాహారాలను తినకపోవడం వల్ల కూడా విటమిన్ బి12 లోపం ఏర్పడే అవకాశాలు ఉంటాయి. ఆటో ఇమ్యూన్ వ్యాధి ఉంటే అలాంటి వారి శరీరం విటమిన్ బి12 ను సరిగ్గా శోషించుకోలేదు. దీంతో కూడా ఈ విటమిన్ లోపం ఏర్పడుంది. జీర్ణాశయ, పేగుల సమస్యలు ఉన్నా, శస్త్ర చికిత్సలు జరిగిన వారిలో, డయాబెటిస్ లేదా గ్యాస్ ట్రబుల్ మందులను వాడేవారిలో విటమిన్ బి12 లోపం వస్తుంది. విటమిన్ బి12 లోపం ఉంటే తీవ్రమైన నీరసం, అలసట ఉంటాయి. చేతులు, పాదాల్లో స్పర్శ లేనట్లు ఉంటుంది లేదా సూదుల్తో గుచ్చినట్లు ఉంటుంది.

**ఎవరికి ఎంత కావాలి..?**

విటమిన్ బి12 లోపం ఉన్నవారిలో కొందరికి చర్మం పాలిపోయి లేదా పసుపు రంగులో కనిపిస్తుంది. నాలుక వాపులకు గురై ఎరుపు రంగులో దర్శనమిస్తుంది. ఆకలి అనిపించదు. ఏ ఆహారం తినాలనిపించదు. బరువు తగ్గుతారు. ఏ విషయంపై కూడా ధ్యాస పెట్టలేకపోతుంటారు. శ్వాస తీసుకోవడంలో సమస్యగా అనిపిస్తుంది. జ్ఞాపకశక్తి, ఏకాగ్రత లోపిస్తాయి. కొందరు డిప్రెషన్ బారిన పడతారు. చిరాగ్గా అనిపిస్తుంది. ఇక రోజుకు ఎవరికి ఎంత మోతాదులో విటమిన్ బి12 అవసరం అవుతుందనే విషయానికి వస్తే 19 ఏళ్లకు పైబడిన వారికి రోజుకు 2.4 మైక్రోగ్రాముల మేర విటమిన్ బి12 అవసరం. గర్భిణీలకు రోజుకు 2.6 మైక్రోగ్రాముల మేర ఈ విటమిన్ కావాలి. పాలిచ్చే తల్లులు రోజుకు 2.8 మైక్రోగ్రాముల విటమిన్ బి12ను తీసుకోవాల్సి ఉంటుంది. విటమిన్ బి12 లోపం ఉన్నవారికి వైద్యులు మందులను ఇస్తుంటారు. విటమిన్ బి12 ట్యాబ్లెట్లను డాక్టర్ సలహా మేరకు వేసుకుంటే ఈ లోపం తగ్గుతుంది. సాధారణంగా 500 మైక్రోగ్రాముల విటమిన్ బి12 ట్యాబ్లెట్‌ను మింగితే అందులో శరీరం కేవలం 10 మైక్రోగ్రాముల విటమిన్ బి12 ను మాత్రమే శోషించుకుంటుంది.

**ఈ ఆహారాల్లో..**

విటమిన్ బి12 మనకు ఎక్కువగా జంతు సంబంధ ఉత్పత్తుల్లో లభిస్తుంది. మటన్ లివర్, కిడ్నీలు, చేపలు, రొయ్యలు, పాలు, చీజ్, పెరుగు, కోడిగుడ్లు, చికెన్ వంటి ఆహారాలను తరచూ తింటుంటే విటమిన్ బి12ను పొందవచ్చు. పలు శాకాహారాల్లోనూ మనకు విటమిన్ బి12 స్వల్ప మోతాదులో లభిస్తుంది. ఫోర్టిఫైడ్ సిరియల్స్, సోయా పాలు, బాదం పాలు, న్యూట్రిషనల్ ఈస్ట్, పుట్టగొడుగులు వంటి శాకాహారాలను తినడం వల్ల కూడా విటమిన్ బి12 లభిస్తుంది. కానీ వీటిల్లో స్వల్ప మోతాదులో మాత్రమే ఈ విటమిన్ ఉంటుంది. ఇలా విటమిన్ బి12 ఉన్న ఆహారాలను రోజూ తింటే ఆరోగ్యంగా ఉండవచ్చు.



# నోటితో గుండెకు చేటు!

అధిక కొలెస్ట్రాల్, రక్తపోటు, ధూమపానం.. గుండెపోటు రావడానికి ప్రధాన కారణాలని తెలిసిందే! కానీ, నోటి బ్యాక్టీరియా కూడా హృద్రోగాలకు కారణం అవుతుందని తాజా అధ్యయనం కనుగొన్నది. జర్నల్ ఆఫ్ ది అమెరికన్ హార్ట్ అసోసియేషన్‌లో ప్రచురితమైన ఫిన్లాండ్, ఇంగ్లండ్ పరిశోధకులు నిర్వహించిన సర్వే.. నోటి శుభ్రతకు- గుండెపోటుకు లంకె ఉన్నట్లు వెల్లడించింది.

బ్రషింగ్, ఫ్లాసింగ్‌కు గుండె ఆరోగ్యానికి సంబంధం లేదని ఇన్నాళ్లూ అనుకునేవారు. కానీ, నోటి పరిశుభ్రత.. హృదయ సంబంధ వ్యాధులను నివారించడంలో కీలక పాత్ర పోషిస్తుందని పరిశోధనలు సూచిస్తున్నాయి. నోటిలో సాధారణంగా కనిపించే ఓరల్ విరిడాన్స్ స్ట్రెప్టోకోకి – అథెరోస్లెరోసిన్ అనే బ్యాక్టీరియా.. గుండెపోటుకు కారణమవ్వొచ్చని పరిశోధకులు గుర్తించారు. అధ్యయనంలో భాగంగా.. అకస్మాత్తుగా మరణించిన 121 మంది వ్యక్తుల కరోనరీ ప్లేక్స్, 96 మంది వాస్కులర్ సర్జరీ రోగుల ధమని నమూనాలను శాస్త్రవేత్తలు విశ్లేషించారు. ఆశ్చర్యకరంగా.. దాదాపు సగం కేసులలో బ్యాక్టీరియల్ డీఎన్ఏను కనుగొన్నట్లు వెల్లడించారు. సదరు బ్యాక్టీరియా ధమనుల లోపల ప్రవర్తించే విధానంలోనే గుండెపోటు వచ్చే పరిస్థితి ఏర్పడుతుందని వెల్లడించారు. ఈ బ్యాక్టీరియా ధమనుల లోపలి భాగానికి అంటుకొని బయోఫిల్మ్‌గా పిలిచే కాలనీలను ఏర్పాటు చేసుకుంటాయి. దీర్ఘకాలంలో ధమనుల్లో రక్త సరఫరాకు అంతరాయం కలిగిస్తాయి.

ధమనులు, రక్త నాళాలలో కొలెస్ట్రాల్‌తోపాటు బ్యాక్టీరియా బయోఫిల్మ్‌లు కూడా గుండెకు చేటు చేస్తాయి. ఈ జెల్లీ లాంటి నిర్మాణాలు, అందులో బ్యాక్టీరియా.. రోగనిరోధక వ్యవస్థతోపాటు యాంటి బయాటిక్స్ నుంచి కూడా తప్పించుకొని జీవిస్తుంటాయి. ఎలాంటి పరీక్షల్లో బయట పడకుండా.. దశాబ్దాలపాటు తిష్టవేసి ఉంటాయి. వైరల్ ఇన్ఫెక్షన్లు, దీర్ఘకాలిక ఒత్తిడికి గురైనప్పుడు.. ఆ బ్యాక్టీరియా తిరిగి మేల్కొంటుంది. దాంతో వచ్చే ఇన్‌ఫ్లమేషన్.. ధమనులపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఫలితంగా ధమనుల్లో రక్తం గడ్డకట్టడం, గుండెపోటు లాంటి ప్రాణాంతక పరిస్థితులకు దారితీస్తుంది. గుండెపోటులో సూక్ష్మజీవుల ప్రమేయం గురించి గతంలోనే చర్చకు వచ్చినప్పటికీ.. ఇప్పటివరకూ పరిశోధనల్లో నమ్మదగిన సాక్ష్యాలతో బయటపడలేదని అధ్యయనకారులు చెబుతున్నారు. ఈ కొత్త ఆవిష్కరణ ద్వారా.. నోటి అపరిశుభ్రతతో తలెత్తే గుండెపోటు ప్రమాదాలను ముందుగా పసిగట్టే అవకాశం ఉన్నదని వెల్లడించారు. ఈ బయోఫిల్మ్‌లను తనిఖీ చేసే పరీక్షలు, చికిత్స ద్వారా మరణాలు తగ్గించే అవకాశం ఉన్నదని ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.



# చెక్కతో చక్కగా!

దాల్చిన చెక్క.. ఆహారానికి రుచితోపాటు ఆరోగ్యానికి ఎన్నో ప్రయోజనాలు అందిస్తుంది. అంతేకాదు.. అందాన్ని కాపాడటంలోనూ ముందుంటుంది. దాల్చిన చెక్కలోని యాంటి ఇన్‌ఫ్లమేటరీ, యాంటి మైక్రోబయల్ లక్షణాలు.. మొటిమలు, ఇతర చర్మ ఇన్ఫెక్షన్లను తగ్గించడంలో ముందుంటాయి. ఇందులోని పాలీఫెనాల్స్, యూజినాల్.. శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌తో పోరాడతాయి. ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించి.. కణాల నష్టాన్ని, వృద్ధాప్య ఛాయల్ని నివారిస్తాయి.

దాల్చిన చెక్కలోని యాంటి ఆక్సిడెంట్లు.. స్కిన్ టోన్‌ను మెరుగుపరుస్తాయి. ఒక టీస్పూన్ దాల్చిన చెక్క పొడిలో రెండు టేబుల్ స్పూన్ల పెరుగు వేసి బాగా కలపాలి. ఆ మిశ్రమాన్ని ముఖానికి అప్లయి చేయాలి. 15-20 నిముషాల తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి.

యాంటి ఫంగల్, యాంటి బ్యాక్టీరియల్, యాంటి ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు దాల్చిన చెక్కలో పుష్కలం. ఇవి మొటిమలను తగ్గించడంలో సమర్థంగా పనిచేస్తాయి. ఇందుకోసం ఒక టీస్పూన్ దాల్చిన చెక్క పొడిలో రెండు టేబుల్ స్పూన్ల తేనె కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లయి చేసి.. 15-20 నిమిషాల తర్వాత శుభ్రం చేసుకోవాలి. పెదాలకు రక్త ప్రవాహం పెంచడంలో చెక్క సాయపడుతుంది. దాంతో పెదాలు ఆరోగ్యంగా ఉండి, మరింత అందంగా కనిపిస్తాయి. టేబుల్ స్పూన్ కొబ్బరి నూనెలో చిటికెడు దాల్చిన చెక్క పొడి వేసి.. బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని పెదవులకు అప్లయి చేసి, కొన్ని నిమిషాల తర్వాత కడిగేయాలి. జుట్టు ఆరోగ్యంగా పెరగడంలోనూ దాల్చినచెక్క సాయపడుతుంది. ఒక టీస్పూన్ దాల్చిన చెక్క పొడిలో రెండు టేబుల్ స్పూన్ల కొబ్బరి నూనెను వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని తలకు పట్టించి.. సున్నితంగా మసాజ్ చేయాలి. 30 నిమిషాల తర్వాత.. తక్కువ గాఢత కలిగిన షాంపూతో తలస్నానం చేయాలి. దాంతో జుట్టు కుదుళ్లకు రక్త సరఫరా బాగా జరిగి.. జుట్టు రాలడం తగ్గుతుంది.

# చపాతీలను నెయ్యితో కాల్చి తినండి.. అనేక లాభాలను పొందవచ్చు

ఆరోగ్యంగా ఉండాలని చెప్పి చాలా మంది రోజూ చపాతీలను తింటుంటారు. రాత్రి పూట అన్నం మానేసి చపాతీలను తింటే బరువు తగ్గుతారని, షుగర్, కొలెస్ట్రాల్ నియంత్రణలో ఉంటాయని చాలా మంది రాత్రి పూట కేవలం చపాతీలను మాత్రమే తింటుంటారు. అయితే ఇది వాస్తవమే అయినప్పటికీ చపాతీలపై నెయ్యి రాసి తింటే ఇంకా ఎంతో మేలు చేస్తాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. నెయ్యిని మనం తరచూ ఉపయోగిస్తూనే ఉంటాం. దీంతో అనేక రకాల స్వీట్లను తయారు చేస్తారు. పలు కూరల్లో, బిర్యానీ వంటకాల్లోనూ నెయ్యిని వేస్తుంటారు. అయితే చపాతీలపై నెయ్యిని రాసి తింటే ఎంతో రుచిగా ఉండడమే కాకుండా అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. చపాతీలను ఈ విధంగా తినడం వల్ల ఎంతో మేలు జరుగుతుందని అంటున్నారు.



**జీర్ణ వ్యవస్థకు..**

సాధారణంగా చపాతీలను గోధుమ పిండితో తయారు చేస్తారు. ఇందులో ఫైబర్, సంక్లిష్టమైన పిండి పదార్థాల కారణంగా కొందరికి చపాతీలను తింటే సరిగ్గా జీర్ణం కావు. అజీర్తి, గ్యాస్, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు వస్తాయి. అయితే చపాతీలను కాల్చేటప్పుడు వాటిపై కాస్త నెయ్యిని వేసి కాల్చాలి. అలా తయారు చేసిన చపాతీలను తినాలి. ఇలా చపాతీలను తింటే సులభంగా జీర్ణం అవుతాయి. అజీర్తి, గ్యాస్, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు ఏర్పడవు. నెయ్యిలో బ్యుటిరేట్ అనే ఫ్యాటీ యాసిడ్ ఉంటుంది. ఇది జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. బ్యుటిరేట్ వల్ల జీర్ణాశయం, పేగుల గోడలు దృఢంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. ఇది జీర్ణ శక్తిని మెరుగు పరుస్తుంది. మలబద్ధకాన్ని తగ్గిస్తుంది.

**షుగర్ ఉన్నవారికి..**

చపాతీలకు నెయ్యిని రాయడం వల్ల చపాతీల గ్లైసీమిక్ ఇండెక్స్ చాలా వరకు తగ్గుతుంది. నెయ్యిలో ఉండే ఆరోగ్యవంతమైన కొవ్వుల కారణంగా చపాతీల్లో ఉండే పిండి పదార్థాలు రక్తంలో నెమ్మదిగా గ్లూకోజ్‌గా మారుతాయి. దీని వల్ల షుగర్ లెవల్స్ అమాంతం పెరగకుండా ఉంటాయి. ఇది డయాబెటిస్ ఉన్నవారికి ఎంతో మేలు చేస్తుంది. దీని వల్ల షుగర్ లెవల్స్‌ను నియంత్రణలో ఉంచుకోవచ్చు. నెయ్యిలో ఆరోగ్యకరమైన కొవ్వులు అధికంగా ఉంటాయి కనుక ఇవి మెటబాలిజంను మెరుగు పరుస్తాయి. నెయ్యిలో ఉండే శాచురేటెడ్ కొవ్వులతోపాటు ఒమెగా 3, ఒమెగా 3 కొవ్వులు గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి. గుండె కండరాలు, రక్త నాళాల వాపులను తగ్గిస్తాయి. దీని వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. ఈ కొవ్వులు శరీరానికి నిరంతరం శక్తి అందేలా చూస్తాయి. జీవక్రియలు సక్రమంగా నిర్వహించబడేలా పనిచేస్తాయి. నెయ్యిలో ఉండే ఆరోగ్యకరమైన కొవ్వుల కారణంగా కడుపు నిండిన భావన కలుగుతుంది. దీని వల్ల ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయ చేస్తుంది.

**ఎముకల ఆరోగ్యానికి..**

నెయ్యిలో విటమిన్లు ఎ, డి, ఇ, కె అధికంగా ఉంటాయి. అందువల్ల చపాతీలపై నెయ్యిని రాసి తింటే వాటిల్లో ఉండే పోషకాలను శరీరం సరిగ్గా శోషించుకుంటుంది. దీంతో పోషకాహార లోపం ఉండదు. నెయ్యిలో ఫాస్ఫరస్ అధికంగా ఉంటుంది. ఇది మనం తిన్న ఆహారాల్లో ఉండే క్యాల్షియంను శరీరం సరిగ్గా శోషించుకునేలా చేస్తుంది. దీంతో ఎముకలు ఆరోగ్యంగా ఉంటాయి. చపాతీలపై నెయ్యిని రాసి తీసుకోవడం వల్ల చర్మ సంరక్షణకు కావల్సిన పోషకాలు అధికంగా లభిస్తాయి. దీని వల్ల చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. కాంతివంతంగా మారి మెరుస్తుంది. యవ్వనంగా కనిపిస్తారు. ముఖంపై ఉండే మొటిమలు, మచ్చలు, ముడతలు తగ్గిపోతాయి. నెయ్యి వల్ల ఆరోగ్యకరమైన ప్రయోజనాలు కలిగినప్పటికీ దీన్ని మోతాదులోనే తినాల్సి ఉంటుంది. రాత్రి పూట చపాతీలను తింటారు కనుక ఒక టీస్పూన్ కు మించి నెయ్యిని తినకూడదు. ఇలా చపాతీలను నెయ్యితో కాల్చి తింటే అనేక లాభాలను పొందవచ్చు.

# ఆరోగ్యాన్ని పెంచుదాం

సెప్టెంబర్ వచ్చేసింది! అంటే.. వానలతోపాటు ఉష్ణోగ్రతలూ తగ్గుతాయి. ఈ క్రమంలో రాబోయే చలికాలం కోసం పెరటి తోటలను సిద్ధం చేసుకోవాలి. వింటర్‌కు తగ్గట్టుగా కొత్త రకం కూరగాయలు, ఆకు కూరలను పెంచుకోవాలి.

**పాలకూర :** వర్షాకాలంలో ఆకు కూరలకు చాలామంది దూరంగా ఉంటారు. ఎందుకంటే, వర్షాల వల్ల ఆకుకూరలు హానికరంగా మారుతాయి. వానలు తగ్గుముఖం పడుతున్న ఈ సమయంలో.. మీ పెరటి తోటల్లో పాలకూరను నాటుకోండి. అందులోనూ పాలకూర చలికాలంలో వేగంగా పెరుగుతుంది. అందులోనూ చిన్న పాలకూర కొన్ని వారాలలోనే చేతికి అందుతుంది.

**ముల్లంగి:** శరదృతువు వాతావరణానికి ముల్లంగి అనువైనది. చలి వాతావరణంలో ఇది త్వరగా పెరుగుతుంది. కేవలం మూడు వారాల్లోనే తాజా ముల్లంగి కోసుకోవచ్చు. పోషకాలతోపాటు రుచితో నిండిన ఈ ముల్లంగి.. చలికాలంలో వేధించే పలు అనారోగ్య సమస్యల నుంచి రక్షణ కల్పిస్తుంది.

**క్యారెట్ :** ఇక చల్లని వాతావరణంలో చక్కగా పండుతుంది. వీటిని పెరటి తోటల్లో నాటుకుంటే.. ఆరోగ్యాన్ని పెంచుకున్నట్లే!




# పాకిస్తాన్‌తో మ్యాచ్‌లో కుల్దీప్ యాదవ్ ఆడేనా?



ఆసియా కప్ లో శుభారంభం చేసిన టీమిండియా ఇప్పుడు పాకిస్థాన్‌తో జరిగే మ్యాచ్‌కు సిద్ధమవుతోంది. రెండు దేశాలకు ఇది ప్రతిష్టాత్మకమైన మ్యాచ్. కాబట్టి, రెండు జట్లు గెలవాల్సిన ఒత్తిడిలో ఉన్నాయి. అందువల్ల, రెండు జట్లు బలమైన జట్టుతో మైదానంలోకి దిగనున్నాయి. ఇదిలా ఉండగా, టీమిండియా గురించి మాట్లాడితే, యూఏఈతో జరిగిన మ్యాచ్‌లో ఒకే ఓవర్‌లో 3 వికెట్లు తీసిన కుల్దీప్ యాదవ్‌కు పాకిస్థాన్‌తో జరిగే జట్టులో చోటు దక్కడం సందేహమేనని సంజయ్ మంజ్రేకర్ అన్నారు. దుబాయ్ ఇంటర్నేషనల్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో యూఏఈ జట్టు కేవలం 57 పరుగులకే ఆలౌట్ అయింది. ఇంత తక్కువ స్కోరుకే జట్టును ఆలౌట్ చేయడంలో కీలక పాత్ర పోషించిన కుల్దీప్ 2.1 ఓవర్లలో కేవలం 7 పరుగులకు 4 వికెట్లు తీసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు. అయితే, తదుపరి మ్యాచ్‌లో కుల్దీప్‌కు అవకాశం లభించదని సంజయ్ మంజ్రేకర్ సోషల్ మీడియాలో ఒక పోస్ట్‌ను షేర్ చేశాడు. ప్రముఖ వ్యాఖ్యాత సంజయ్ మంజ్రేకర్ తన X ఖాతాలో 'ఒకే ఓవర్‌లో 3 వికెట్లు తీసిన తర్వాత కుల్దీప్ యాదవ్ తదుపరి మ్యాచ్ ఆడకపోవచ్చు' అని రాసుకొచ్చాడు. ఇంత మంచి ప్రదర్శన ఇచ్చినప్పటికీ, కుల్దీప్ తదుపరి మ్యాచ్‌లో అవకాశం రాకపోవచ్చు అని మంజ్రేకర్ ఎందుకు అన్నాడోనని మీరందరూ ఆలోచిస్తుండవచ్చు. కానీ సమాధానం ఏమిటంటే, మంజ్రేకర్ ఈ పోస్ట్‌ను టీమిండియా మేనేజ్‌మెంట్‌ను ఎగతాళి చేస్తూ షేర్ చేశాడన్నమాట. నిజానికి, మంజ్రేకర్ ప్రకటన వెనుక కారణం టీం ఇండియాలో కుల్దీప్ కెరీర్. కుల్దీప్ 2017 లో టీం ఇండియా తరపున అరంగేట్రం చేశాడు. కానీ, అప్పటి నుంచి చాలాసార్లు జట్టు నుంచి తొలగించారు. చాలా సందర్భాలలో, అతని మంచి ప్రదర్శన ఉన్నప్పటికీ, అతను ప్లేయింగ్ 11 నుంచి లేదా జట్టు నుంచి తొలగించారు. ముఖ్యంగా టెస్ట్ క్రికెట్‌లో అతని ప్రస్థానం ప్రశ్నార్థకంగా మారింది. 2019 లో, ఆస్ట్రేలియాతో జరిగిన సిడ్నీ టెస్ట్‌లో 5 వికెట్లు పడగొట్టినప్పటికీ, అతన్ని తొలగించారు. ఆ తర్వాత 2021 లో, అతనికి 1 టెస్ట్ మ్యాచ్ మాత్రమే ఆడే అవకాశం లభించింది. ఆ తర్వాత డిసెంబర్ 2022 లో, అతనికి మళ్ళీ ఆడే అవకాశం లభించింది. బంగ్లాదేశ్‌తో జరిగిన ఆ మ్యాచ్‌లో కుల్దీప్ మళ్లీ 5 వికెట్లు పడగొట్టాడు. అయినప్పటికీ, అతన్ని తొలగించారు. 2024లో నేరుగా జట్టులోకి తిరిగి వచ్చిన కుల్దీప్, గత సంవత్సరం మంచి ప్రదర్శన ఇచ్చినప్పటికీ ఆస్ట్రేలియా పర్యటన, ఆ తరువాత ఇంగ్లాండ్ పర్యటనలో ఒక్క టెస్ట్ మ్యాచ్ కూడా ఆడే అవకాశం రాలేదు. అదేవిధంగా, గత సంవత్సరం జరిగిన టీ20 ప్రపంచ కప్‌లో, అతనికి గ్రూప్ దశ మ్యాచ్‌లలో ఆడే అవకాశం రాలేదు. సూపర్-4 రౌండ్‌లో ఆడే అవకాశం వచ్చినప్పుడు అతను అద్భుతంగా రాణించాడు. దీని కారణంగా, అతని మంచి ప్రదర్శన తర్వాత టీం ఇండియా మేనేజ్‌మెంట్ చాలాసార్లు కుల్దీప్‌ను జట్టు నుంచి తప్పించడానికి ప్రయత్నించింది. అందుకే మంజ్రేకర్ అలాంటి పోస్ట్‌ను షేర్ చేశాడు.

## మ్యాథ్యూ హేడెన్ కీలక వ్యాఖ్యలు



క్రికెట్?లో అత్యంత ప్రతిష్ఠాత్మక టెస్టు సిరీసుల్లో యాషెస్ ఒకటి. ఆస్ట్రేలియా- ఇంగ్లాండ్ జట్ల మధ్య జరిగే ఐదు టెస్టు మ్యాచ్?ల యాషెస్ సిరీస్?పై సర్వత్రా ఆసక్తి ఉంటుంది. ఇందులో సెంచరీ చేసినా, ఐదు వికెట్లు కూల్చినా ఆ ప్లేయర్ల పేరు మార్మోగిపోతుంది. అయితే ఈ నవంబర్ 21న యాషెస్ సిరీస్ ప్రారంభం కానుంది. ఈ సిరీస్?కు ఆస్ట్రేలియా వేదిక కానుంది. ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ మ్యాథ్యూ హేడెన్ హాట్ స్టేట్?మెంట్ ఇచ్చాడు. రీసెంట్?గా ఓ యూట్యూబ్ ఛానెల్?లో మాట్లాడిన హేడెన్ ఇంగ్లాడ్? జట్టులోని ఓ బ్యాటర్ సెంచరీ చేయకపోతే, తాను 'నగ్నంగా నడుస్తా' అని అన్నాడు. ఈ స్టేట్?మెంట్ వైరల్?గా మారింది. దీంతో అతడిని సెంచరీ చేయాలంటూ హేడెన్ కుమార్తె గ్రేస్ హేడెన్ సదరు బ్యాటర్?కు విజ్ఞప్తి చేసింది. ఇంగ్లాండ్ సీనియర్ బ్యాటర్ జో రూట్ ప్రస్తుతం టెస్టు ఫార్మాట్?లో సూపర్ ఫామ్?లో ఉన్నాడు. టెస్టుల్లో అత్యధిక పరుగులు చేసిన సచిన్ తెందూల్కర్ (15,921 పరుగులు) తర్వాత రెండో స్థానంలో రూట్ ఉన్నాడు. ప్రస్తుతం రూట్ 13543 పరుగులతో ప్రపంచంలోనే అత్యధిక టెస్టు పరుగులు చేసిన రెండో బ్యాటర్?గా కొనసాగుతున్నాడు. అతడు తొలి స్థానంలోకి వెళ్లాలంటే కావల్సింది ఇంకా 2,400 పరుగులే. ఈ క్రమంలో రానున్న యాషెస్ రూట్?లో అత్యంత కీలకం కానుంది. అయితే ఆస్ట్రేలియా గడ్డపై రూట్ గణాంకాలు గొప్పగా ఏమీ లేవు. ఇప్పటివరకు ఆసీస్?లో 14 టెస్టులు ఆడితే 35.68 సగటుతో 892 పరుగులే చేశాడు. ఇందులో 9 సెంచరీలు ఉన్నాయి. కానీ ఒక్క సెంచరీ లేకపోవడం గమనార్హం. ఈ క్రమంలో ఆసీస్ మాజీ క్రికెటర్ హేడెన్, రూట్‌పై ఒత్తిడి పెంచేలా ఈ సవాల్ విసిరాడు. ఒకవేళ యాషెస్‌లో రూట్ ఒక్క సెంచరీ కూడా చేయకపోతే నేను మెల్‌బోర్న్ క్రికెట్ మైదానం చుట్టూ నగ్నంగా నడుస్తా" అని సోషల్ మీడియాలో పోస్టు పెట్టాడు. అయితే హేడెన్ స్టేట్?మెంట్ తెగ వైరల్ అయ్యింది. దీంతో అతడి కుమార్తె ఈ పోస్ట్?కు స్పందించింది. ఈ సందర్భంగా రూట్‌కు ఓ రిక్వెస్ట్ చేసింది. 'ప్లీజ్ రూట్. ఒక్క సెంచరీ అయినా బాదు' అని కామెంట్ సెక్షన్?లో కామెంట్ రాసుకొచ్చింది. తండ్రి అలా బోల్డ్ స్టేట్?మెంట్ ఇవ్వడంతో, ప్రత్యర్థి జట్టు బ్యాటర్?ను కూడా సెంచరీ కొట్టమనే పరిస్థితి గ్రేస్?కు వచ్చింది. ప్రస్తుతం ఇది క్రీడావర్గాల్లో హాట్?టాపిక్?గా మారింది. కాగా, మెల్?బోర్న్ వేదికగా నాలుగో టెస్టు జరగనుంది. కాగా, ఈ సిరీస్? 1882- 83లో ప్రారంభమైంది. ఇరుదేశాలకు ఈ సిరీస్ ప్రతిష్ఠాత్మకం. చివరిసారిగా 2023లో సిరీస్ జరిగింది. అప్పుడు ఆస్ట్రేలియా విజేతగా నిలిచింది. ఓవరాల్?గా ఆసీస్? 34సార్లు నెగ్గగా, ఇంగ్లాండ్ 32సార్లు సిరీస్?లో దక్కించుకుంది. 5 సిరీస్?లు డ్రా గా ముగిశాయి.

# బంగ్లా చేతిలో హాంకాంగ్ ఓటమి



ఆసియా కప్ లో బంగ్లాదేశ్ శుభారంభం చేసింది. గురువారం అబుధాబిలోని షేక్ జయేద్ స్టేడియంలో జరిగిన మ్యాచ్ లో హాంకాంగ్ పై ఏడు వికెట్లతో గెలుపొందింది. అన్ని రంగాల్లో రాణించిన బంగ్లా.. కంఫర్టబుల్ విక్టరీని తన సొంతం చేసుకుంది. అంతకుముందు టాస్ ఓడి ఫస్ట్ బ్యాటింగ్ చేసిన హాంకాంగ్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 143 పరుగులు చేసింది. మిడిలార్డర్ బ్యాటర్ నిజఖాత్ ఖాన్ (40 బంతుల్లో 42, 2 ఫోర్లు, 1 సిక్సర్) తో టాప్ స్కోరర్ గా నిలిచాడు. తస్కిన్ అహ్మద్, తంజిమ్ హసన్ షకీబ్, రిషాద్ హుస్సేన్ లకు తలో రెండు వికెట్లు లభించాయి. అనంతరం టార్గెట్ ను 17.4 ఓవర్లలోనే మూడు వికెట్లు కోల్పోయి 144 పరుగులు చేసి, బంగ్లా ఛేదించింది. లిటన్ దాస్ కెప్టెన్ ఇన్నింగ్స్ (39 బంతుల్లో 59, 6 ఫోర్లు, 1 సిక్సర్)తో సూపర్ ఫిఫ్టీ కొట్టి, టాప్ స్కోరర్ గా నిలిచాడు. బౌలర్లలో అతీఖ్ ఇక్బాల్ కు రెండు వికెట్లు దక్కాయి. ఈ ఫార్మాట్ లో హాంకాంగ్ పై బంగ్లాకిదే తొలి విక్టరీ కావడం విశేషం. ఇక ఈ పరాజయంతో హాంకాంగ్ దాదాపుగా టోర్నీ నుంచి నిష్క్రమించింది. తొలి మ్యాచ్ లో ఆఫ్ఘనిస్తాన్ చేతిలోనూ ఓడిన హాంకాంగ్.. రెండు పరాజయాలతో అట్టడుగున నిలిచింది. ఏదైనా అద్భుతం జరిగితే తప్ప, ఆ జట్టు ఇంటిముఖం పట్టడం ఖాయ-ంమే.టాస్ గెలిచి ప్రత్యర్థిని బ్యాటింగ్ కు ఆహ్వానించిన బంగ్లాకు బౌలర్లు చక్కని సహకారం అందించారు. వరుస విరామాల్లో వికెట్లు తీస్తూ, ప్రత్యర్థిపై పై చేయి సాధించేలా చేశారు. ఈ ఇన్నింగ్స్ లో ఒక్క ఫిఫ్టీ భాగస్వామ్యం కూడా లేక పోవడం విశేషం. నిజఖత్ తోపాటు ఓపెనర్ జీషాన్ అలీ (30), కెప్టెన్ యాసిమ్ ముర్తుజా (28) మాత్రమే కాస్త ఫర్వాలేదనిపించారు. మిగతా వాళ్లు బ్యాట్లు ఎత్తేయడంతో హాంకాంగ్ ఓ మాదిరి స్కోరుకే పరిమితమైంది. దీంతో ప్రత్యర్థి ముందు కాస్త చిన్న టార్గెట్ నే నిర్దేశించింది. ఇక చిన్న టార్గెట్ తో బరిలోకి దిగిన బంగ్లాకు శుభారంభం దక్కలేదు. ఆరంభంలోనే ఓపెనర్లు పర్వేజ్ హుస్సేన్ ఈమన్ (19), తంజిద్ హసన్ (14) వికెట్లను కోల్పోయింది. వన్ డౌన్ బ్యాటర్ గా బరిలోకి దిగిన కెప్టెన్ లిటన్ దాస్ తన సత్తా చాటాడు. తౌహిద్ హృదయ్ (36 బంతుల్లో 35 నాటౌట్, 1 ఫోర్) తో కలిసి ఇన్నింగ్స్ నిర్మించాడు. ఒక ఎండ్ లో తౌహిద్ యాంకర్ రోల్ పోషించగా, దాస్ మాత్రం కాస్త వేగంగా ఆడాడు. ప్రత్యర్థి బౌలర్లను సునాయసంగా ఎదుర్కొన్న దాస్.. 33 బంతుల్లోనే ఫిఫ్టీ కొట్టాడు. ఈ క్రమంలో మూడో వికెట్ కు 95 పరుగులు జోడించాక, ఆఖర్లో దాస్ ఔటయ్యాడు. ఆ తర్వాత జాకీర్ అలీ తో కలిసి తౌహిద్ మిగతా లాంఛనాన్ని పూర్తి చేశాడు. అర్ధ సెంచరీ చేసిన దాస్ కే ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది. తర్వాత మ్యాచ్ లో శనివారం (ఈనెల 13న) శ్రీలంకతో బంగ్లా, సోమవారం (ఈనెల 15న) శ్రీలంకతోనే హాంకాంగ్ తలపడనుంది.

## ప్రభుత్వం సలహా మేరకు నడుచుకుంటాం

### భారత్-పాక్ మ్యాచ్‌పై అరుణ్ ధుమాల్



ఆసియా కప్ 2025లో భాగంగా భారత్, పాకిస్థాన్ జట్లు తలపడనున్నాయి. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా ఉగ్రవాదుల ఏరివేతే లక్ష్యంగా భారత్ నిర్వహించిన ఆపరేషన్ సింధూర్ తర్వాత ఈ రెండు దేశాలు తలపడటం ఇదే తొలిసారి. ఈ నేపథ్యంలో భారత్-పాక్ మ్యాచ్‌పై ఐపీఎల్ ఛైర్మన్ అరుణ్ ధుమాల్ ఓ కీలక ప్రకటన చేశారు. ప్టెంబర్ 14న భారత్, పాకిస్థాన్ మధ్య ఆసియా కప్ 2025లో భాగంగా కీలక మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్ కోసం ఇప్పటికే సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. భారత జట్టు ఇప్పటికే టోర్నమెంట్?లో తన ప్రయాణాన్ని ప్రారంభించింది. సెప్టెంబర్ 10న యూఏఈతో జరిగిన మ్యాచ్‌లో భారత్ 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి శుభారంభం చేసింది. అయితే ఈ భారత్-పాకిస్థాన్ మ్యాచ్‌ను చాలా మంది వ్యతిరేకిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఐపీఎల్ ఛైర్మన్ అరుణ్ ధుమాల్ దీనిపై తన అభిప్రాయానని వెల్లడించారు. అరుణ్ ధుమాల్ మాట్లాడుతూ.. " ఆసియా కప్ కోసం భారత జట్టుకు నా శుభాకాంక్షలు. ద్వైపాక్షిక మ్యాచ్‌ల విషయంలో పాకిస్తాన్‌తో ఆడబోమని ప్రభుత్వం తమ వైఖరిని స్పష్టం చేసింది. అయితే ఏసీసీ లేదా ఐసీసీ టోర్నమెంట్లు ఉన్నప్పుడు మనం వాటిలో పాల్గొనాల్సి ఉంటుంది. అందుకే మనం ప్రభుత్వం సలహా మేరకు నడుచుకుంటాం" అని తెలిపారు. అరుణ్ ధుమాల్‌తో పాటు దేశంలోని అనేక ప్రముఖులు భారత్-పాకిస్థాన్ మ్యాచ్‌పై తమ స్పందనలు తెలియజేశారు. ఆసియా కప్ చరిత్రను చూస్తే భారత్ అత్యధిక సార్లు టైటిల్‌ను గెలుచుకుంది. ఇప్పటివరకు టీమిండియా మొత్తం 8 టైటిళ్లు గెలుచుకోగా.. శ్రీలంక 6 టైటిళ్లతో రెండో స్థానం ఉంది. పాకిస్థాన్ రెండు టైటిళ్లను గెలుచుకుంది. బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్, యూఏఈ, ఇతర ఆసియా దేశాలు తమ మొదటి ట్రోఫీ కోసం ఎదురుచూస్తున్నాయి. భారత్ 1984, 1988, 1990/91, 1995, 2010, 2016, 2018, 2023లో టైటిళ్లను గెలుచుకుంది. ఆసియా కప్ 2025లో కూడా భారత్ తన టైటిల్‌ను నిలబెట్టుకోవడానికి సిద్ధంగా ఉంది. తొలిసారిగా సూర్యకుమార్ యాదవ్ భారత జట్టుకు ఆసియా కప్‌లో కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నారు. సూర్యకుమార్ యాదవ్‌పై భారీ అంచనాలు ఉన్నాయి.

## షాహిద్ అఫ్రిదీ వివాదాస్పద వ్యాఖ్యలు



భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌కి ముందు పాక్ మాజీ క్రికెటర్ షాహిద్ అఫ్రిదీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశాడు. ఆసియా కప్ 2025లో భాగంగా ఈ నెల 14న అంటే ఆదివారం దుబాయ్ వేదికగా భారత్, పాక్ జట్లు తలపడనున్నాయి. ఈ క్రమంలో ఓ టీవీ షోలో పాల్గొన్న అఫ్రిదీ టీమిండియా మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్‌పై పరోక్షంగా విమర్శలు గుప్పించాడు. కొంతమంది టీమిండియా క్రికెటర్లు తాము భారతీయులం అని నిరూపించుకునేందుకు ఆరాటపడుతున్నారని అన్నాడు. అలాగే పాకిస్థాన్‌తో భారత్ క్రికెటర్ ఆడేందుకు వేదికలు, టోర్నమెంట్లు అంటూ భారత్ సాకులు చెబుతోందని విమర్శించారు. ఇలా ద్వంద్వ వైఖరి అవలంభించడం సరికాదని అన్నాడు. ఆసియా కప్‌లో పాకిస్థాన్‌తో మ్యాచ్ ఆడొద్దనే డిమాండ్ వ్యక్తం అయినప్పటికీ.. బీసీసీఐ పాక్‌తో మ్యాచ్‌కు ఓకే చెప్పింది. కానీ, అంతకంటే ముందు రిటైర్డ్ ఆటగాళ్లు పాల్గొన్న లెజెండ్స్ టోర్నీలో మాత్రం భారత మాజీ క్రికెటర్లు పాకిస్థాన్‌తో మ్యాచ్ ఆడేందుకు నిరాకరించారు. లీగ్ దశలో ఒక మ్యాచ్‌లో, అలాగే సెమీ ఫైనల్ మ్యాచ?ను పాకిస్థాన్‌తో ఆడాల్సి ఉండగా.. యువరాజ్ సింగ్ కెప్టెన్సీలోని టీమిండియా తమకు దేశం ముఖ్యం అంటూ పాకిస్థాన్‌తో మ్యాచ్‌ను రద్దు చేసుకుంది. దీనిపై ఆ టోర్నీలో పాక్ కెప్టెన్‌గా వ్యవహరించిన అఫ్రిదీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. అప్పుడు ఆడని వాళ్లు, ఇప్పుడు ఆసియా కప్‌లో పాకిస్థాన్‌తో ఎలా ఆడతారంటూ ప్రశ్నించాడు. ఈ ద్వంద్వ వైఖరి సరికాదని, పూర్తిగా పాకిస్థాన్‌తో క్రికెట్ ఆడటమే మానుకోవాలని కూడా అన్నాడు.


# మనం మ్యాచ్ గెలుస్తామని నమ్మకం ఉంది

### పదే పదే మ్యాచ్ రద్దు చేయాలని అడగకూడదు

### టీమ్ఇండియా దిగ్గజం కపిల్ దేవ్

2025 ఆసియా కప్‌లో భారత్- పాకిస్థాన్ మ్యాచ్ కోసం క్రికెట్ లవర్స్ ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. మరో రెండు రోజుల్లో ఈ మోస్ట్ అవెయిటెడ్ మ్యాచ్ జరగనుంది. దుబాయ్ ఇంటర్నేషనల్ స్టేడియం వేదికగా ఆదివారం (సెప్టెంబర్ 14)న రాత్రి 8 గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. దీంతో అందరి కళ్లీ ఈ పోరుపైనే ఉన్నాయి. టోర్నీ మొత్తంలో ఇదే హై వోల్టేజ్ మ్యాచ్ అనడంలో సందేహం లేదు. అయితే ఈ ఫైట్?? కోసం ఓవైపు ఫ్యాన్స్? వెయిట్ చేస్తుంటే, మరోవైపు ఈ మ్యాచ్?ను రద్దు చేయాలంటూ మరికొందరు అభిమానులు సోషల్ మీడియాలో ట్రెండ్ చేస్తున్నారు. పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో పాక్?తో టీమ్ఇండియా క్రికెట్ ఆడవద్దంటూ కొందరు పోస్ట్?లు షేర్ చేస్తున్నారు. మ్యాచ్?ను రద్దు చేయాలంటూ కోరుతున్నారు. అయితే ఈ కాంట్రవర్సీపై టీమ్ఇండియా దిగ్గజం కపిల్ దేవ్ స్పందించారు.

షెడ్యూల్ ప్రకారం ఈ మ్యాచ్? జరగనివ్వాలని కపిల్ దేవ్ ఫ్యాన్స్?ను కోరాడు. పదే పదే మ్యాచ్? రద్దు చేయాలని అడగకూడదని అన్నాడు. మ్యాచ్?ను రద్దు చేయడం బీసీసీఐ చేతుల్లోనో, పీసీబీ చేతుల్లోనో లేదని



చెప్పాడు. ఆ నిర్ణయం తీసుకోవాల్సింది ఇరుదేశాల ప్రభుత్వాలని కపిల్ దేవ్ రీసెంట్?గా మీడియాతో చిట్?చాట్?లో పేర్కొన్నాడు. "ఇది అద్భుతమైన జట్టు. టీమ్ఇండియాకు గుడ్ లక్. మనం మ్యాచ్? గెలుస్తామని నమ్మకం ఉంది. మన టీమ్ ట్రోఫీతో ఇంటికి తిరిగివస్తుందని ఆశిస్తున్నా. ఆటపైనే పూర్తిగా దృష్టి పెట్టండి. మ్యాచ్? నెగ్గడంపైనే ఫోకస్ ఉంచండి. మీ పని క్రికెట్ ఆడడమే. ఎవరూ కూడా మ్యాచ్ ఆడడాన్ని పెద్ద సమస్యగా మార్చకండి. ప్రభుత్వం తమ పని తాము చేసుకుంటుంది. ఆటగాళ్లు మీ పని మీరు చేయండి" అని కపిల్ దేవ్ అన్నాడు. కాగా, ఈ మ్యాచ్?ను ఆపాలని కొందరు ఇటీవల సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించారు. మ్యాచ్ జరగాడానికి కొన్ని రోజులే ఉన్న నేపథ్యంలో తమ పిటిషన్‌ను త్వరగా విచారించాలని పిటిషన్లు విజ్ఞప్తి చేశారు. అయితే దానికి కోర్టు నిరాకరించింది. ఇది క్రికెట్ మ్యాచ్ మాత్రమే. ఇందులో తొందరేం లేదని కోర్టు పేర్కొంది. పహల్గామ్ టెర్రర్ ఎటాక్ తర్వాత భారత్-పాక్ మధ్య రాజకీయ సంబంధాలు మరింత క్షీణించాయి. దీంతో ఆసియా కప్ షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచి టోర్నీలో భారత్- పాక్ మ్యాచ్ ఉండడాన్ని కొందరు తప్పుబడుతున్నారు. ఈ పోరును బాయ్?కట్ చేయాలంటూ ట్రెండ్ చేస్తున్నారు. అయితే ద్వైపాక్షిన సిరీస్?లు తప్పా, మల్టీనేషనల్ టోర్నీల్లో పాక్?తో ఆడేందుకు భారత ప్రభుత్వ పాలసీకి తాము కట్టుబడి ఉన్నామని బీసీసీఐ ఇప్పటికే స్పష్టం చేసింది. ఈ క్రమంలోనే భారత్ మల్టీనేషనల్ టోర్నీల్లోనే పాక్?తో ఆడుతుంది. ద్వైపాక్షిక సిరీస్?ల్లో ఎప్పటిలాగే నిషేధం కొనసాగుతుంది.

కాగా, ఈ టోర్నీలో గడిచిన 16 ఎడిషన్లలో మొత్తం 19సార్లు ఢీ కొట్టాయి. ఇందులో భారత్ అత్యధికంగా 10 మ్యాచ్?ల్లో నెగ్గింది. పాకిస్థాన్ ఆరు మ్యాచ్?ల్లోనే విజయం సాధించింది. మరో 3 మ్యాచ్?ల్లో ఫలితం తేలలేదు.

## సోషల్ మీడియాకు దూరంగా అనుష్క

చాలా రోజుల విరామం తర్వాత ఇటీవల 'ఘాటి'తో పలకరించారు అనుష్క. కొన్నేళ్లుగా మీడియాకు దూరంగా ఉంటోన్న ఆమె తాజాగా సోషల్ మీడియాకు కూడా దూరంగా ఉండనున్నట్లు- ప్రకటించారు. సోషల్ మీడియాకు కొంతకాలం బ్రేక్ ఇస్తున్నట్లు- తెలుపుతూ పోస్ట్ పెట్టారు. తానే స్వయంగా లెటర్ రాసి దాన్ని పోస్ట్ చేశారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండాలనుకుంటున్నా. ఎప్పుడూ స్క్రోలింగ్ చేసే లైఫ్‌కు దూరంగా.. నిజమైన ప్రపంచానికి దగ్గరగా ఉండాలని నిర్ణయించుకున్నా. త్వరలోనే మరిన్ని మంచి కథలతో మరింత ప్రేమతో మీ ముందుకువస్తాను' అని తాను రాసిన లెటర్‌ను పోస్ట్ చేశారు. ఈ లెటర్ వైరల్ కావడంతో అనుష్క (ఆషఠీశ) ఈ నిర్ణయం ఎందుకు తీసుకున్నారా అని అభిమానులు చర్చించు కుంటున్నారు. ఇటీవల వచ్చిన 'ఘాటి' ప్రచారంలోనూ స్వీటి పరోక్షంగా పాల్గొన్నారు. రానా, అల్లు అర్జున్‌లతో ఫోన్‌లో మాట్లాడి సినిమా విశేషాలతో పాటు- కొన్ని ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. తాను కొన్ని రోజులుగా ఎక్కడికీ వెళ్లడం లేదని చెప్పారు. ఇంట్లో జరిగే పెళ్లిళ్లకు కూడా హాజరుకావడం లేదన్నారు. త్వరలోనే అందరి ముందుకువస్తానని చెప్పారు. వచ్చే ఏడాది నుంచి వరుస సినిమాలు చేస్తానని అభిమానులకు హామీ ఇచ్చారు. ఇక క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో అనుష్క ప్రధాన పాత్రలో యాక్షన్ -క్రై-మ్ డ్రామాగా 'ఘాటి' రూపొందింది. భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకువచ్చిన ఆ చిత్రం మిశ్రమ ఫలితాన్ని అందుకుంది





## ఆడవాళ్లు రిస్క్ తీసుకోవాల్సిందే!

కెరీర్ గురించి మాట్లాడిన ప్రతీ సారీ టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత అందరిలోనూ ఆసక్తిని కలిగిస్తూ ఉంటారు. సినీ ఇండస్ట్రీలో 15 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సమంత తాజాగా ఓ వీడియోను షేర్ చేస్తూ ఆ వీడియోలో పలు ఇంట్రెస్టింగ్ విషయాల గురించి ప్రస్తావించారు. సమంత తన కెరీర్లో ఎన్నో సక్సెస్‌లు, ఫెయిల్యూర్లు, కష్టాలు, సవాళ్లు ఎదుర్కొని స్ట్రాంగ్ గా నిలిచారు. స్టార్‌డమ్ పర్మినెంట్ కాదు అయితే తాజాగా సమంత షేర్ చేసిన వీడియోలో తన కెరీర్లో కొత్త ఛాప్టర్ మొదలైందని, ఆ జర్నీ ద్వారా ఇతరులకు స్ఫూర్తిని ఇవ్వాలని తాను కోరుకుంటున్నట్టు చెప్పారు. స్టార్‌డమ్ అనేది పర్మినెంట్ కాదని, నటీనటుల లైఫ్ లో నేమ్, ఫేమ్ కొంత కాలం మాత్రమే ఉంటాయని, ఒకానొక దశలో ఆడియన్స్ కొత్త మొఖాలను స్వాగతిస్తూ, కొత్త తరహా కథలపై ఇంట్రెస్ట్ చూపిస్తారన్నారు. ఆ టైమ్ ను గుర్తించి, తమను తామెలా మార్చుకుని, తమ ఎఫెక్ట్ ను సమాజంపై ఎలా చూపిస్తారనేదే అసలైన సక్సెస్ అని సమంత చెప్పారు. ఇండస్ట్రీలో హీరోయిన్ల జర్నీ ఎక్కువ కాలం ఉండదని, అవకాశాలు కూడా చాలా తక్కువగానే వస్తాయని చెప్పిన మాట ఆమె సొంత అనుభవంతో చెప్పినదే. అయినప్పటికీ, తాను అందుకున్న సక్సెస్‌లు ఎంతోమంది ఆదర్శంగా నిలుస్తాయని సమంత చెప్పారు. స్టార్ గా ఉన్నప్పుడు కొందరికి స్ఫూర్తిగా ఉండటం, కనీసం ఒకరికి అయినా మార్గదర్శకురాలిగా ఉండగలగడం నిజమైన సంతృప్తినిస్తుందని సమంత పేర్కొన్నారు. ప్రతీ మహిళా ధైర్యంగా ముందుకు అడుగు వేయాలని, ఏ విషయంలోనైనా ఎలాంటి భయం లేకుండా రిస్క్ తీసుకునే మహిళలే సక్సెస్ అవుతారని తాను కచ్చితంగా చెప్పగలనని అంటున్నారు సమంత. దూరదృష్టి, కెరీర్ పై ప్లానింగ్ ఉన్న ప్రతీ మహిళా బయటకు వచ్చి తన ఆలోచనలను షేర్ చేసుకోవాలని, ప్రస్తుత ప్రపంచం వారి లీడర్‌షిప్‌నే కోరుకుంటుందని సమంత చెప్పారు. ఓ వైపు సినిమాల్లో హీరోయిన్ గా నటిస్తూనే మరోవైపు ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ పేరిట సొంత బ్యానర్ ను స్థాపించిన సమంత, మొదటి సినిమాగా శుభం ను నిర్మించి మంచి హిట్ ను అందుకున్నారు.

## రాజాసాబ్ షూటింగ్ పార్ట్ పూర్తి

### నటి మాళవికా మోహనన్ వెల్లడి



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ప్రస్తుతం ఫుల్ ఫామ్‌లో ఉన్నాడు. వరుసగా భారీ సినిమాలతో బిజీగా మారిపోయిన ఆయన, ఇప్పుడు ఓ వినూత్న కాన్సెప్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. మారుతీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'రాజా సాబ్' సినిమా సంక్రాంతికి థియేటర్లలో సందడి చేయడానికి రెడీ అవుతోంది. ఇప్పటి వరకు యాక్షన్, రొమాన్స్, ఫాంటసీ సినిమాల్లో అలరించిన ప్రభాస్, తన కెరీర్‌లో మొదటి సారి హారర్ అండ్ కామెడీ నేపథ్యంలో రూపొందిన సినిమాలో నటిస్తున్నాడు. ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రంలో మలయాళ బ్యూటీ- మాళవిక మోహనన్ హీరోయిన్‌గా నటిస్తోంది. ప్రభాస్‌తో కలిసి పనిచేయడం తనకు ప్రత్యేక అనుభవంగా మారిందని ఆమె తాజాగా వెల్లడించింది. ప్రభాస్ చాలా శాంతంగా ఉంటారు. ఆయన వయసు నాకంటే ఎక్కువే అయినా, ఆయనను చూస్తే అలానే అనిపించదు. సహజంగా ఉంటారు. 'రాజా సాబ్'లో మా జంట చాలా బాగా వర్కౌట్ అయిందని ఆమె అన్నారు. ఈ కామెంట్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అయితే పనిలో పనిగా మూవీకి సంబంధించిన అప్‌డేట్ కూడా వచ్చింది. సినిమా కూడా పూర్తయ్యింది. కొన్ని పాటలను చిత్రీకరించాల్సి ఉందని పేర్కొంది ఈ బ్యూటీ-. ప్రస్తుతం మాళవిక చేసిన ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ప్రభాస్ సరసన మాళవికతో పాటు- నిధి అగర్వాల్ మరియు రిద్దీ కుమార్ కూడా కథానాయికలుగా నటిస్తున్నారు.

ఈ సినిమాకి థమన్ సంగీతం అందిస్తున్నాడు. అక్టోబర్ 23 ప్రభాస్ బర్త్‌డే సందర్భంగా 'రాజా సాబ్' నుంచి ఫస్ట్ సాంగ్ రాబోతున్నట్లు- బలమైన సమాచారం. అయితే ఈ విషయంపై ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

## విజువల్ ఎఫెక్ట్స్ పెద్ద అసెట్

### కొత్తదనంతో వచ్చిన మిరాయ్

హను-మాన్'తో భారీ విజయాన్ని అందుకున్న తేజ సజ్జా 'మిరాయ్'తో సూపర్ యోధాగా యాక్షన్ హంగామా చూపించేందుకు సిద్ధమయ్యాడు. 'ఈగల్' తర్వాత కార్తీక్ ఘట్టమనేని తెరకెక్కించిన చిత్రమిది. మంచు మనోజ్ ప్రతినాయకుడిగా నటించడం టీజర్, -ట్రైలర్లు అద్భుతమైన విజువల్స్‌తో ఆకట్టు-కోవడం.. ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలేర్పడ్డాయి. సామ్రాట్ అశోక్ కళింగ యుద్ధం గెలిచాక.. జరిగిన విధ్వంసాన్ని తలచుకుని పశ్చాత్తాపడతాడు. ఆ వినాశనానికి తనలోని దైవశక్తే ఓ కారణమని భావించి.. ఆ శక్తిని తొమ్మిది గ్రంథాల్లో నిక్షిప్తం చేసి.. వాటి రక్షణ బాధ్యతను తొమ్మిది మంది యోధుల చేతుల్లో పెడతాడు. కొన్ని శతాబ్దాల తర్వాత ఆ గ్రంథాలపై దుష్టశక్తి మహావీర్ లామా (మంచు మనోజ్) కన్నుపడుతుంది. అతను తనకున్న తంత్ర శక్తులతో ప్రపంచంలోని వివిధ ప్రదేశాల్లో ఉన్న ఎనిమిది మహిమాన్విత గ్రంథాల్ని.. దానికి రక్షణగా ఉన్న యోధుల్ని తుద ముట్టించి హస్తగతం చేసుకుంటాడు. అయితే అతను కోరుకున్నట్లుగా అమరత్వాన్ని సాధించి.. ప్రపంచాన్ని శాసించే శక్తిగా ఎదగాలంటే తొమ్మిదో గ్రంథం అవసరమవుతుంది. కానీ, అమరత్వానికి సంబంధించిన ఆ గ్రంథాన్ని సొంతం చేసుకోవడం అంత తేలిక కాదు. ఎందుకంటే దానికి రక్షణగా ఉండేది అంబిక. మహావీర్ రూపంలో ప్రపంచానికి ఎదురు కానున్న ముప్పును ముందే జ్ఞాన దృష్టితో చూసిన అంబిక.. అతన్ని ఎదుర్కొనేందుకు తనకు పుట్టిన బిడ్డ వేద (తేజ సజ్జా)ను పసికందుగా ఉన్నప్పుడే దూరం చేసుకుంటుంది. మరి ఆ తర్వాత ఏమైంది? అనాథగా వివిధ ప్రాంతాల్లో పెరిగిన వేద తన బాధ్యతను.. తల్లి ఆశయాన్ని ఎలా తెలుసుకుంటాడు? మహావీర్ లామా నుంచి ప్రపంచానికి ఎదురు కానున్న ముప్పును తప్పించేందుకు అతనేం చేశాడు? ఇందుకు అతనికి రాముడు సృష్టించిన మిరాయ్ అస్త్రం ఎందుకు అవసరమైంది? చివరికి యుద్ధంలో ఎవరు



గెలిచారు? అన్న అంశాలే కథగా చిత్రం తెరకెక్కింది. తొమ్మిది మహిమాన్విత గ్రంథాల సాయంతో అమరత్వాన్ని పొంది, తాను కోరుకున్నట్లుగా సరికొత్త ప్రపంచాన్ని సృష్టించాలనుకునే ఓ దుష్టశక్తికి.. ఆ వినాశాన్ని అడ్డుకునేందుకు దైవ సంకల్పంతో పుట్టిన ఓ సామాన్య మానవుడికి మధ్య జరిగిన సంగ్రామమే క్లుప్తంగా ఈ చిత్ర కథాంశం. కథను త్రేతాయుగంలోని శ్రీరాముడి నేపథ్యంతో ముడిపెట్టిన తీరు.. ఆయన కోదండాన్ని మిరాయ్ అస్త్రంలా సినిమాలో వినియోగించుకున్న విధానం.. ఈ మొత్తాన్ని తల్లి సెంటిమెంట్‌తో ముడివేసిన తీరు.. ఇలా అన్నీ ఇటు పిల్లల్ని అటు పెద్దల్ని థ్రిల్ చేసేలా ఉంటాయి. ఓ కొత్త సినిమాటిక్ అనుభూతిని అందిస్తాయి. టైటిల్ కార్డ్స్‌తోనే ప్రభాస్ వాయిస్‌తో కళింగ యుద్ధ నేపథ్యాన్ని.. తొమ్మిది గ్రంథాలకి ఉన్న విశిష్ఠతను, శక్తిని పరిచయం చేసిన తీరు ప్రేక్షకులకు ఓ సర్‌ప్రైజ్ ఎలిమెంట్.

దీంతో కథ మొదలైన దగ్గరి నుంచే ప్రేక్షకుడు దానితో కలిసి ప్రయాణం చేయడం ప్రారంభిస్తాడు. ఆ తర్వాత ఒకవైపు అంబిక.. మరోవైపు మహావీర్ లామా పాత్రల్ని తెరపైకి తెచ్చి.. వాళ్ల లక్ష్యాల్ని.. వారివల్ల కథలో సంఘర్షణ ఎలా పుట్టనుందన్నది రుచి చూపించారు. ఇక లామా నుంచి ఎదురు కానున్న ముప్పు అడ్డుకునేందుకు అంబిక బిడ్డను వెతికి తీసుకొచ్చేందుకు కథానాయిక సిద్ధమవ్వడం.. ఈ క్రమంలో చార్మినార్ కుర్రాడిగా హీరో తెరకు పరిచయమైన తీరు.. ఈ మధ్యలో వచ్చే యాక్షన్ సీక్వెన్స్ అలరిస్తాయి. హీరో ఎప్పుడైతే తన జన్మ రహస్యాన్ని.. తల్లి సంకల్పాన్ని తెలుసుకుని మిరాయ్ అస్త్రాన్ని సాధించేందుకు ప్రయాణం ప్రారంభిస్తాడో అక్కడి నుంచే కథ మరింత రసవత్తరంగా మారుతుంది. ఈ క్రమంలో కళ్లు చెదిరేలా సంపాతి ఎపిసోడ్‌తో విరామ సన్నివేశాల్ని తీర్చిదిద్దుకున్న విధానం ప్రేక్షకుల్ని థ్రిల్ చేస్తుంది. మిరాయ్ వేద చేతికి వచ్చాక అతను యోధాగా ఎలా మారాడు.. తల్లి జాడను వెతుక్కుంటూ వెళ్లిన ప్రయాణంలో అతను తెలుసుకున్న నిజమేంటి? ఆమె తొమ్మిదో గ్రంథాన్ని దాచి పెట్టిన ప్రాంతాన్ని అతనెలా కనిపెట్టాడు? అక్కడికి ఎలా చేరుకున్నాడు? ఆ గ్రంథం కోసం మహావీర్ లామాకు వేదకు మధ్య ఎలాంటి పోరు సాగిందన్నది ద్వితీయార్థానికి కీలకం. వీటిలో వేద మిరాయ్ శక్తిని అర్థం చేసుకుని.. దాన్ని తన అస్త్రంగా చేసుకుని యోధగా మారడం.. ఈ క్రమంలో దాని సాయంతో మహావీర్ లామా గ్యాంగ్‌ను చితక్కొటడం థియేటర్లో ప్రేక్షకులకు మంచి కిక్ ఇస్తుంది. మహావీర్ లామాగా మనోజ్ విలనిజం.. తన లుక్, స్క్రీన్ ప్రజెన్స్ చక్కగా కుదిరాయి. అయితే ఆ పాత్ర గతాన్ని ఇంకాస్త శక్తిమంతంగా తీర్చిదిద్దాల్సింది. హీరో తల్లిగా అంబిక పాత్రలో శ్రియ ఆకట్టుకుంటుంది. కథలో ఎంతో ప్రాధాన్యమున్న పాత్ర ఆమెది. జగపతిబాబు, జయరామ్ పాత్రల పరిధి చిన్నదే అయినా కథలో ప్రాముఖ్యత ఉంది. రితికా హీరోకి దారి చూపే పాత్రగా కనిపించింది.

## దెయ్యం బ్యాక్‌డ్రాప్‌లో మరో మూవీ

### బెల్లంకొండ, అనుపమల కిష్కింధపురి

రాఘవ్ (బెల్లంకొండ సాయిశ్రీనివాస్), మైథిలి (అనుపమ) ప్రేమికులు. ఆ ఇద్దరూ మరొక స్నేహితుడు (సుదర్శన్)తో కలిసి ఘోస్ట్ వాకింగ్ పేరుతో హాంటెడ్ హౌసెస్ టూర్స్‌ని నిర్వహిస్తుంటారు. థ్రిల్ కోరుకునే వాళ్లందరినీ కలిపి ఓ పాడుబడిన బంగ్లాల్లోకి తీసుకెళ్లి అక్కడ దెయ్యాలు ఉన్నాయని నమ్మిస్తూ థ్రిల్ పంచడమే ఆ టూర్ ఉద్దేశం. అలా ఓసారి 11 మందితో కలిసి కిష్కింధపురి అనే ఊరి పరిసరాల్లో ఉన్న సువర్ణమాయ అనే రేడియో స్టేషన్‌కి వెళతారు. 1989లోనే పాడుబడిన స్టేషన్ అది. అందులోకి అడుగు పెట్టాక రేడియో నుంచి ఓ వాయిస్ వినిపిస్తుంది. అది దెయ్యంలా మారిన వేదవతి వాయిస్ అని ఆ తర్వాత తెలుస్తుంది. సువర్ణమాయలోకి అడుగు పెట్టిన 11 మందిలో ఎవ్వరినీ వదిలిపెట్టనని వార్నింగ్ ఇస్తుంది వేదవతి. చెప్పినట్టుగానే వెంటనే ఆ బృందంలో ముగ్గురు చనిపోతారు. ఆ తర్వాత అందులోని ఓ చిన్నారి టార్గెట్ అవుతుంది. అది పసిగట్టిన రాఘవ్ తన ప్రాణాల్ని అడ్డుపెట్టి దెయ్యానికి ఎదురెళతాడు. అసలు ఆ వేదవతి ఎవరు? ఎందుకు దెయ్యంలా మారింది? సువర్ణమాయ స్టేషన్‌తో ఆమెకున్న సంబంధం ఏమిటి? అందులోకి వెళ్లినవాళ్లని ఎందుకు చంపేస్తోంది? అన్నది చిత్ర కథ. హారర్‌తో పాటు-, థ్రిల్లింగ్ అంశాల మేళవింపుతో రాసుకున్న కథ ఇది. ప్రథమార్ధంలో దెయ్యాన్ని చూపిస్తూ భయపెట్టేందుకు.. ద్వితీయార్ధంలో ఆ దెయ్యం వెనకున్న కథని చెబుతూ థ్రిల్‌ని పంచేందుకు ప్రయత్నిస్తుందీ సినిమా. భయపెట్టడం వరకూ ఫర్వాలేదనిపిస్తుంది కానీ, ద్వితీ-యార్ధంలో థ్రిల్లింగ్ అనుభూతి కాస్త తగ్గింది. అయితే, థియేటర్‌లో ఉన్నంతసేపూ ఆ కథలో చోటు- చేసుకునే మలుపులు ఆసక్తిని రేకెత్తిస్తాయి. సినిమాలో చాలా చోట్ల లాజిక్‌ని పక్కనపెట్టి భయపెట్టే ప్రయత్నం కనిపిస్తుంది. సువర్ణమాయ రేడియో స్టేషన్‌లోకి అడుగుపెట్టాకే అసలు కథ మొదలవుతుంది. అక్కడ వేదవతి వాయిస్ వినిపించడంతో కథలో హారర్ కోణం వెలుగులోకి వస్తుంది. రైల్‌లో ఉన్న ఇద్దరు పైలట్లని చంపడం, ఆ తర్వాత నిర్మాణంలో ఉన్న బిల్డింగ్‌పై నుంచి ఒకరిని కిందకి పడేసి చంపే సన్నివేశాలు కథలోని అసలు సిసలు



హారర్ నేపథ్యాన్ని పరిచయం చేస్తుంది. కథానాయకుడు ఒక పక్క మిగిలినవాళ్ల ప్రాణాల్ని కాపాడుతూనే, మరోపక్క సువర్ణమాయ కథ తెలుసుకునేందుకు ప్రయత్నించే క్రమంతో సెకండాఫ్ మొదలవుతుంది. ఫ్లాష్‌బ్యాక్‌గా వచ్చే సువర్ణమాయ స్టేషన్, వేదవతి, విశ్రవ పుత్ర కథలు సినిమాకి కీలకం. ఆ కథంతా సినిమా చూస్తున్నంతసేపూ ఆసక్తికరంగానే అనిపించినా, విశ్రవపుత్ర కథ మాత్రం రాక్షసుడు సినిమాలోని ఓ ఎపిసోడ్‌ని గుర్తు చేస్తుంది. బెల్లంకొండ శ్రీనివాస్ కొత్త జోనర్‌ని ప్రయత్నిస్తూనే... తన మార్క్ యాక్షన్ అంశాల్ని మిస్ కాకుండా చూసుకున్నారు. యాక్షన్ అవతారంతో మెప్పిస్తూనే... హారర్ ప్రధానంగా సాగే సన్నివేశాల్లో మంచి నటనని ప్రదర్శించారు. అనుపమ (ఆఘూశపశ శసశప।÷ఔశసశ) అందంగా కనిపిస్తూనే, ద్వితీయార్థంలో భయపెడుతుంది. ఆమె దెయ్యంగా మారే ఎపిసోడ్ ఆకట్టు-కుంటుంది. విశ్రవపుత్ర పాత్రలో నృత్య దర్శకుడు శాండీ మాస్టర్ చాలా బాగా నటించారు. ఆయన ప్రథమార్ధంలో కనిపించిన విధానమే భయపెడుతుంది. సీనియర్ కథానాయిక ప్రేమ నటన ఆకట్టుకుంటుంది. డీ గ్లామర్‌గా కనిపిస్తూ ఆమె తల్లి పాత్రకి ప్రాణం పోశారు. పతాక సన్నివేశాల్లోనూ ఆమె పాత్ర ఓ మంచి మలుపునిస్తుంది. సాంకేతికంగా సినిమా ఉన్నతంగా ఉంది.

Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell :  9966847463